నేటి కందం- నేటికి అందం

గ్రామీణ ప్రాంతములలో
ప్రాముఖ్యతతో వెలుగు తపాలా జనులన్
ధీమతులని, సేవల నిడు
శ్రామికులని చంద్రబాబు సన్మానించెన్ !!

(గ్రామీణ తపాలా సేవకులే నిజమైన ప్రజా సేవకులని కొనియాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేలాది గ్రామీణ తపాలా సేవకులను సన్మానించారు



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

సమస్యల ఉధృతిని
చేయకుంటే సున్నా
ఉద్యమాలు జనంలోనా
ఉబికొస్తయి మిన్నా
అణచివేత తాత్కాలిక
ఔషధమే ఎప్పుడు
అభివృద్ధి జరుపకుండా
ఆపలేరు చప్పుడు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 24-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:162 పేజీలు:6 వెల: రూ.1/-


## సుప్రీంకోర్టులో గౌరవెల్లి ప్రాజెక్ట్ కేసు గెలుస్తాం: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 23: గౌరవెల్లి ప్రాజెక్టు.. అనేక కారణాలు, లీగల్ సమస్యల వల్ల ఆలస్యం అవుతుందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.. సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టు కాలువల భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేసేలా సమీక్షా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టు కోసం తమ మీద ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ మూడు జిల్లాల కలెక్టర్‌లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని అన్నారు.

లీగల్ ఇబ్బందులపై చర్చ..

గౌరవెల్లి ప్రాజెక్టులో లీగల్ ఇబ్బందులు ఎలా క్లియర్ చేయాలో చర్చించామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణ, పనుల వేగవంతంపై ఎలా ముందుకు వెళ్లాలో చర్చించామన్నారు. భూసేకరణ విషయంలో హామీ ఇచ్చామని తెలిపారు. సంబంధిత నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు. ఈ మేరకు బుధవారం నాడు సుప్రీంకోర్టులో ఈ ప్రాజెక్టు కేసు విచారణ ఉందని ప్రస్తావించారు. సర్వోన్నత న్యాయస్థానంలో ఎన్వీరాన్‌మెంట్ కేసు గెలుస్తామనే విశ్వాసం తమకుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును అన్ని విధాలుగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి రావడానికి కావల్సిన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి 300 మీటర్ల దిగువన నదిలో పడిన బస్సు..

### 18 మంది దుర్మరణం

నేపాల్ ఫిబ్రవరి 23: పొరుగు దేశం నేపాల్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లా లో ఓ ప్రయాణికుల బస్సు అదుపుతప్పి రోడ్డుకు 300 మీటర్ల దిగువన లోయలో ప్రవహిస్తున్న త్రిశూలి నది లో పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 18 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని మెరుగైన చికిత్స కోసం ఖాట్మండు ఆస్పత్రికి తీసుకెళ్లారు

బస్సు పోఖారా నుంచి ఖాట్మండుకు వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 44 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే నేపాల్ పోలీసులు, ఆర్మీ, సాయుధ బలగాలు ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సు లోతైన లోయలో పడిపోవడం, లోపల బాగా చీకటిగా ఉండటంతో రెస్క్యూ ఆపరేషన్ క్లిష్టంగా మారింది.

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో ఆరుగురు మహిళలు, 12 మంది పురుషులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వారిలో ఒక మహిళ, ఒక పురుషుడు న్యూజిలాండ్ దేశానికి చెందిన పర్యాటకులుగా గుర్తించారు. గాయపడిన 26 మందిలో కూడా పలువురు విదేశీ టూరిస్టులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, అతివేగం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

## తెలంగాణ క్యాబినెట్ భేటీ.. జనగణనపై కీలక చర్చ



హైదరాబాద్, ఫిబ్రవరి 23: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ(సోమవారం) క్యాబినెట్ సమావేశం అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చిస్తున్నారు. అయితే, స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణనపై మంత్రి మండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన ప్రక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు.

జనగణన-2027 కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. మే 11వ తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో జనగణన ప్రక్రియకు 89 వేల మంది సిబ్బందిని నియమించింది. మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. జనగణన 2027పై కేబినెట్ నిర్ణయాలని సీఎస్ రామకృష్ణారావు వెల్లడించారు. కేంద్రం నిర్దేశించిన 34 ప్రశ్నలతో జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. హౌస్ లిస్టింగ్‌కు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 34 ప్రశ్నల నమూనాను సీఎస్ వివరించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన ప్రక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

## అనాథలకు ఉపాధి కల్పన.. తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 23: అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమాన యాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాండ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి.

ఈ శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు.

పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండస్ట్రీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జీ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జీ యునివర్సిటీ ఇవ్వనుంది.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని? భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వంపరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగు లు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## అమెరికా దాడుల భయం.. ఇరాన్‌లో పరిస్థితి ఉద్రిక్తం..

### తక్షణమే ఆదేశాన్ని వీడండి .. భారత పౌరులకు ఎంబసీ అడ్వయిజరీ



న్యూ డిల్లీ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏ క్షణమైనా ఇరాన్ పై అమెరికా దాడులు చేయవచ్చునన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు అక్కడి మన తాజాగా అడ్వయిజరీ జారీచేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది.'ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా జనవరి 5న భారత ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వయిరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండండి' అని ఇరాన్‌లోని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో పేర్కొన్నది.అలాగే తాజా పరిణామాల సమాచారం కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచించింది. భారతీయులంతా పాస్‌పోర్టులు, ఐడీ కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పింది. ఈ విషయంలో ఎలాంటి సాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొంది. ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలి' అని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో తెలిపింది.ఇరాన్-అమెరికా దేశాల మధ్య అణు చర్చలు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై దాడికి వెనుకాడబోమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే అమెరికా పలు విమాన వాహక నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లను పశ్చిమాసియాలో మోహరించింది. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌లో మరోసారి ఆందోళనలు చెలరేగాయి. పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ పరిణామాలతో ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఇరాన్‌లో తొలిదశ అల్లర్లలోనే 7,105 మంది ప్రాణాలు కోల్పోయారని అమెరికాకు చెందిన ఒక మానవ హక్కుల సంఘం తెలిపింది.

## కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత

కామారెడ్డి, ఫిబ్రవరి 23: కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి ఈ రోజు (సోమవారం) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డిలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్బంధంలో ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. బ్రిడ్జి పై నుంచి ఆర్టీసీ బస్సు



ఆదిలాబాద్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉట్నూరు మండలం శ్యామ్‌పూర్‌లో సోమవారం ఉదయం బ్రిడ్జి పై నుంచి ఆర్టీసీ బస్సు కింద పడింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు.ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి వచ్చిన పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సును ఆసిఫాబాద్ డిపోనకు చెందినదిగా గుర్తించారు.

## ఉగ్రవాదంపై ఉక్కుపాదం.. ప్రహార్ పాలసీ వెల్లడించిన హోంశాఖ

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23: ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర హోంశాఖ సమగ్రమైన కొత్త విధానాన్ని డెవలప్ చేసింది. ప్రహార్ పేరుతో యాంటీ టెర్రర్ పాలసీని రూపొందించింది. ఉగ్రవాద సవాళ్లను ఎదుర్కొనే రీతిలో ఆ విధానాన్ని తయారు చేశారు. సీమాంతర ఉగ్రవాదం, సైబర్ దాడులు, డ్రోన్ల దుర్వినియోగం, సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ పాలసీని రూపొదించినట్లు తెలుస్తోంది. కేవలం సీమాంతర ఉగ్రవాదమే కాదు.. ఇతర దేశాల నుంచి భారత్‌పై సైబర్ దాడులకు పాల్పడుతున్న నేరాలను అడ్డుకునేందుకు ఈ ప్రహార్ పాలసీలో ప్రణాళికలు పొందుపరిచారు.

కేంద్ర హోంశాఖ ఇవాళ తన వెబ్‌సైట్‌లో ప్రహార్ డాక్యుమెంట్‌ను అప్‌లోడ్ చేసింది. ఉగ్రవాదాన్ని ఓ మతానికి, ప్రాంతానికి, నాగరికతకు ఆపాదించబోమని ఆ డాక్యుమెంట్‌లో హోంశాఖ పేర్కొన్నది. స్పాన్సర్ టెర్రరిజం ద్వారా భారత్‌పై ప్రభావం పడిందని, జిహాదీ ఉగ్రవాద సంస్థలు కూడా తమ ప్లాన్‌ను అలాగే అమలు చేస్తున్నాయని ప్రహార్‌లో పేర్కొన్నారు. ఆల్‌ఖయిదా, ఇస్లామిక్ స్టేట్ లాంటి సంస్థలు స్లీపర్ సెల్స్ ద్వారా భారత్‌లో హింసకు ప్రేరేపిస్తున్నాయని పాలసీలో ప్రస్తావించారు.పంజాబ్, జమ్మూకశ్మీర్ లాంటి రాష్ట్రాల్లో ఉగ్రసంస్థలు డ్రోన్లు వాడి తమ నెట్వర్క్‌ను పెంచే ప్రయత్నం చేస్తున్నాయని ఆ పాలసీ డాక్యుమెంట్‌లో వెల్లడించారు. డిజిటల్ వేదికగా కూడా సైబర్ నేరాలు జరుగుతున్నాయి. వాటిని ఎదుర్కొనేందుకు కూడా ప్లాన్ చేశారు.

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విధానంలో భాగంగా కేంద్ర హోంశాఖ ఓ రోడ్‌మ్యాప్ తయారు చేసింది. దర్యాప్తు జరిగే ప్రతి దశలోనూ లీగల్ నిపుణుల సలహా తీసుకోవాలన్నది. ఎఫ్ఐఆర్‌ల రిజిస్ట్రేషన్, కేసులను బలంగా నమోదు చేయడం అవసరమని ప్రహార్‌లో చెప్పింది. భారతీయ యువతను ఉగ్ర గ్రూపులు రిక్రూట్ చేసుకుంటున్నాయని, అలాంటి వ్యక్తులపై న్యాయపరమైన కఠిన చర్యలను తీసుకోవాలన్నది. తీవ్ర హింసకు పాల్పడినా, యువతను ప్రలోబ పెట్టినా.. ఆ తర్వాత జరిగే పరిణామాల గురించి ఎన్జీవోలో, మతపరమైన నేతలకు వివరించనున్నారు. భద్రతా సమస్యలను ఓ సహకార పద్ధతిలో, సాంకేతికంగా, కమ్యూనిటీ స్థాయిలో పరిష్కరించే రీతిలో సూచనలు చేస్తూ ప్రహార్ డాక్యుమెంట్‌ను రూపొందించారు.

## సత్వర విద్యుత్ సేవలకు వాట్సాప్ చాట్: సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

హైదరాబాద్, ఫిబ్రవరి 23: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు.

సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు వాట్సాప్ చాట్‌బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమోదుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్‌లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.


ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
సౌమిత్రి పబ్లికేషన్స్, విశాఖ సంస్కృతి మాసపత్రిక,
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ రచయిత
శ్రీ కూర చిదంబరం రచించిన
"సమీక్షా సౌరభాలు"
&
సమీక్షా సుమమాలిక
పుస్తకావిష్కరణ

శ్రీ కూర శంకరయ్య, శ్రీమతి లలితమ్మ స్మారక
కథా పురస్కారము-2025 ప్రదానము

విశాఖ సంస్కృతి తెలుగు మాస పత్రిక

తేది : 28-02-2026 శనివారం సా॥ 5-30 గం॥లకు
వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, మొదటి అంతస్తు, హైదరాబాద్

ముఖ్య అతిథి, ఆవిష్కర్త : డా॥ కె.వి.రమణాచారి గారు, ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు
సభాధ్యక్షులు : శ్రీ బైసా దేవదాసు గారు,
సంపాదకులు, నేటి నిజం దినపత్రిక
విశిష్ట అతిథి : శ్రీ ఏనుగు నర్సింహారెడ్డి గారు, ఐ.ఎ.ఎస్.
సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ
ఆత్మీయ అతిథి : శ్రీ అనుముల బాబురావు గారు, కేఫ్ నిలోఫర్, అధినేత
గౌరవ అతిథులు : సుప్రసిద్ధ సాహితీ వేత్తలు :
శ్రీ విహారి గారు, (జె.ఎస్.మూర్తి) ప్రముఖ రచయిత
శ్రీ సుధామ గారు, 'ఓసారి చూడండి' వాట్సప్ ప్రసార సంచిక, వ్యవస్థాపకులు
శ్రీ సింహ ప్రసాద్ గారు, ప్రముఖ రచయిత

సమీక్షా సౌరభాలు అంకితం : కీ.శే. శ్రీ తంగిరాల చక్రవర్తి గారి దివ్యస్మృతికి

కథా పురస్కారము 2025 : ప్రథమ బహుమతి : శ్రీ రామా చంద్రమౌళి గారు - "నిర్వాణ" కథలు)
ప్రోత్సాహక బహుమతి : శ్రీమతి లలితా వర్మ గారు - "ఆణిముత్యాలు" కథలు)

సమన్వయం : శ్రీ శిరేల సన్యాసిరావు గారు - సంపాదకులు, విశాఖ సంస్కృతి మాసపత్రిక
శ్రీ రఘుశ్రీ గారు - సెక్రటరీ, మానస ఆర్ట్స్ థియేటర్స్

బండారుపల్లి రామచంద్రరావు, అధ్యక్షులు, మానస | సౌమిత్రి పబ్లికేషన్స్ | శిరేల సన్యాసిరావు, విశాఖ సంస్కృతి | డా॥ లలితావాణి, కార్యదర్శి, మానస

# సెంట్రల్ ఎక్సైజ్ సేవల పట్ల అవగాహన కలిగి ఉందాం !

## (24 ఫిబ్రవరి "సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం" సందర్భంగా)

1855లో భారత దేశంలోనే అతి పురాతనమైన విభాగం "సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్" ఏర్పడింది. భారత రెవెన్యూ, ఆర్థిక శాఖల పరిధిలో పని చేస్తున్న సెంట్రల్ ఎక్సైజ్ లేదా సెంట్రల్ జీఎస్టీ శాఖ ఎక్సైజ్ డ్యూటీ, సర్వీస్ టాక్స్, కస్టమ్స్ డ్యూటీ, నార్కొటిక్స్ డ్యూటీ, జీఎస్టీ లాంటి పన్నులను సక్రమంగా వసూలు చేయడంలో ప్రధాన భూమికను నిర్వహిస్తూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను కూడా అరికట్టడంలో తన వంతు కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నది.

సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం:

24 ఫిబ్రవరి 1944న "సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సాల్ట్ చట్టం-1944" ఏర్పడిన శుభ సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 24 ఫిబ్రవరిన దేశవ్యాప్తంగా "సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ఈ వేదికగా సామాన్య ప్రజలకు సెంట్రల్ ఎక్సైజ్ శాఖ పట్ల కనీస అవగాహన కల్పించడంతో పాటు సదస్సులు, కార్యశాలలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యాలయాల్లో పోటీలు, అవార్డుల ప్రదానం లాంటివి నిర్వహించడం జరుగుతుంది. సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో నిష్ఠతో సేవలందించిన సిబ్బందిని గుర్తించి సన్మానాలు కూడా చేయడం అభినందనీయం.

జీఎస్టీ అమలు:

వస్తు ఉత్పత్తి పరిశ్రమల వ్యాపార లావాదేవీల్లో అవకతవకలను అరికట్టడానికి, పారదర్శకత పెంచడానికి, సత్సాంప్రదాయాలను నెలకొల్పడానికి, సంబంధిత చట్టాలను పటిష్ఠంగా అమలు చేయడానికి సెంట్రల్ ఎక్సైజ్ శాఖ కృషి చేస్తున్నది. ఈ శాఖలో కస్టమ్స్ ఆక్ట్-1962, కస్టమ్స్ ట్రాఫిక్ ఆక్ట్-1975, సెంట్రల్ ఎక్సైజ్ ఆక్ట్-1944, సర్వీస్ ఆక్ట్ లాంటి చట్టాలను గట్టిగా అమలు చేయడంలో సెంట్రల్ ఎక్సైజ్ పాత్ర చాలా పెద్దది. ప్రస్తుతం అమలు అవుతున్న జీఎస్టీ అమలు 01 జూలై 2017 నుంచి అమలులోకి వచ్చింది. పన్నుల వసూళ్లు సమర్థవంతంగా జరిగితే ప్రభుత్వ ఆదాయం పెరిగి పేదరిక నిర్మూలనతో పాటు దేశాభివృద్ధి సుసాధ్యం అవుతుంది.

ప్రభుత్వ రంగ సంస్థలు తమ తమ విధులను సక్రమంగా నిర్వహించిన నాడు దేశ ఆదాయం భారీగా పెరగడం, వాటితో దేశ సుస్థిరాభివృద్ధి సుసాధ్యం కావడం జరుగుతుందని గమనించి అవినీతికి తావులేని ప్రభుత్వ యంత్రాంగాలు విధి నిర్వహణలో నిమగ్నం అయినపుడు నీతివంతమైన పాలన, పౌర సమాజం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతుంది. "ధనవంతున్ని కావాలని కలలు కనడం కన్న లక్ష్యాలను ఛేదిస్తూ విజయ తీరాలను ముద్దాడడం మిన్న" అని నమ్ముదాం, మనం ఎదుగుతూ, మన దేశాభివృద్ధికి దోహదపడదాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశమంతా నేడు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల సరికొత్త యుగాన్ని చూస్తోంది: ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23: మీరట్‌లో నమో భారత్ రాపిడ్ రైల్, మీరట్ మెట్రో మార్గాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును 'వికసిత ఉత్తరప్రదేశ్' 'వికసిత భారత్' కోసం ఒక సరికొత్త శక్తిగా ఆయన అభివర్ణించారు. భారతదేశంలో ఒకే ప్లాట్‌ఫారమ్ నుంచి రాపిడ్ రైల్, మెట్రో సర్వీస్ రెండూ ఒకే రోజు ప్రారంభం కావడం ఇదే తొలిసారి.

ఈ ప్రాజెక్ట్ వికసిత భారత్‌లో అనుసంధానత ఎలా ఉంటుందనే ఒక అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ సమీకృత వ్యవస్థ నగరంలో ప్రయాణానికి మెట్రోను, ట్విన్ సిటీస్ దార్శని కతను వేగవంతం చేయడానికి నమో భారత్ రైళ్లను ఉపయోగిస్తుంది. డబుల్ ఇంజన్ ప్రభుత్వ పని సంస్కృతిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రాజెక్టులు ఇకపై గతంలో లాగా మధ్యలో నిలిచిపోవని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. తాము శంకుస్థాపన చేసిన పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవం రెండింటినీ తామే స్వయంగా చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

తమ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి మీరట్ మెట్రోలో ప్రయాణించి విద్యార్థులు, ప్రయాణికులతో ముచ్చటించారు. రైలు ఆపరేటర్లు, స్టేషన్ నియంత్రణ సిబ్బందిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారని పేర్కొంటూ, ఈ ప్రాజెక్టును 'నారీ శక్తి'కి చిహ్నంగా ప్రధానమంత్రి కొనియాడారు. దేశంలోనే తొలి నమో భారత్ రాపిడ్ రైల్ సేవలు ప్రారంభమైన సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

మీరట్‌తో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, 2014, 2019, 2024 జాతీయ ఎన్నికల ప్రచారాలన్నీ ఈ విప్లవ గడ్డ నుంచే నుండే ప్రారంభమయ్యాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. నిరంతర ఆశీస్సులు అందిస్తున్న ఈ ప్రాంత రైతులకు, కళాకారులకు, పారిశ్రామికవేత్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "2014 కంటే ముందు మెట్రో సేవలు కేవలం 5 నగరాల్లో మాత్రమే ఉండేవి, కానీ ఇప్పుడు 25 కంటే ఎక్కువ నగరాల్లో మెట్రోలు నడుస్తున్నాయి, ఇది భారత్‌ను ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద నెట్‌వర్క్‌గా నిలబెట్టింది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. "ఈ ప్రాజెక్ట్ లో సారాయ్ కాలే ఖాన్, ఆనంద్ విహార్, ఘజియాబాద్, మీరట్ వద్ద భారతీయ రైల్వేలు, మెట్రో ఇంకా బస్సు స్టాండ్‌ల అనుసంధా నం ఒకప్రత్యేకత. భారతదేశంలో తొలిసారిగా నమో భారత్ మెట్రో రైలు ఒకే ట్రాక్, ఒకే స్టేషన్‌లో నడుస్తాయి" అని శ్రీ మోదీ ప్రముఖంగా పేర్కొన్నారు. ఈ అనుసంధానం వల్ల ప్రయాణికులు నగరం లోపల ప్రయాణించవచ్చు లేదా నేరుగా ఢిల్లీకి వెళ్లవచ్చు, తద్వారా చాలా మంది కార్మికులు, విద్యార్థులు ఢిల్లీలో అద్దె ఇళ్లలో ఉండాల్సిన అవసరం తప్పుతుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

"ఎక్స్‌ప్రెస్‌వేలు, ఫ్రైట్ కారిడార్లు, జేవార్ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి ఆధునిక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడులు అపారమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి కొత్త పరిశ్రమలను, వ్యాపారాలను ఆకర్షిస్తున్నాయి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఉత్తరప్రదేశ్ శ్రమకు, సృజనకు నిలయమని అభివర్ణిస్తూ, రాష్ట్ర రైతులు, కళాకారులు వారసత్వం - అభివృద్ధి మంత్రాన్ని విజయవంతంగా సాకారం చేస్తున్నారని ప్రధానమంత్రి చెప్పారు. భారత ప్రపంచ శక్తి పెరుగుతున్న కొద్దీ, భారత యువశక్తిని ఉపయోగించుకోవడానికి అభివృద్ధి చెందిన దేశాలు వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడానికి ఆసక్తిగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "నేడు ప్రపంచం 21వ శతాబ్దపు సవాళ్లను పరిష్కరించగల శక్తిగా భారత్‌ను చూస్తోంది, దీనివల్ల ఉత్తరప్రదేశ్ పౌరులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రస్తావిస్తూ, ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో 10,000 కోట్ల రూపాయల ప్రత్యేక నిధిని కేటాయించినట్లు ప్రధానమంత్రి చెప్పారు, ఇది ఎం ఎస్ ఎం ఈలకు రుణాలు సులభంగా అందేలా చేస్తుంది. నేత కార్మికులు అంతర్జాతీయ మార్కెట్‌లకు చేరువయ్యేలా సహాయపడటానికి ఉద్దేశించిన 'మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్ యోజన' గురించి కూడా ఆయన ప్రస్తావించారు. కొరియర్ ద్వారా వస్తువులను పంపడంపై ఉన్న రూ. 10 లక్షల పరిమితిని తొలగించామని, దీనివల్ల మీరట్, ఉత్తరప్రదేశ్ అంతటా ఉన్న చిన్న తరహా పారిశ్రామికవేత్తలు ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా నేరుగా అమెరికా, యూరప్‌లోని వినియోగదారులకు తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చని ప్రధానమంత్రి ప్రకటించారు.

''చౌదరి చరణ్ సింగ్ దార్శనికతను గౌరవిస్తూ, ప్రభుత్వం ఆయనకు భారతరత్నను అందజేసింది. ఆయన స్ఫూర్తితో, ఫుడ్ ప్రాసెసింగ్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు డబుల్ ఇంజన్ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ పథకం కింద ఉత్తరప్రదేశ్ రైతులకు ఇప్పటికే దాదాపు 95,000 కోట్ల రూపాయలు అందాయి'' అని శ్రీ మోదీ తెలిపారు.

ఉత్తరప్రదేశ్ అభివృద్ధి అత్యంత ప్రధానమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఒకప్పుడు అల్లర్లు, నేరాలకు నిలయంగా ఉన్న రాష్ట్రం, నేడు బ్రహ్మోస్ క్షిపణులు, మొబైల్ తయారీ, పర్యాటక రంగాలకు గుర్తింపు పొందుతోందని ఆయన పేర్కొన్నారు. నేడు నేరస్థులు జైళ్లలో ఉన్నారని, ఆడబిడ్డలు గౌరవంతో ఉన్నారని, మెరుగుపడిన శాంతిభద్రతలు రాష్ట్రంలో భారీ ఆర్థిక వృద్ధికి, తయారీ రంగ విస్తరణకు దారితీశాయని ఆయన తెలిపారు.

"ఉత్తరప్రదేశ్ ఒక తయారీ కేంద్రంగా మారుతోంది, ఇటీవలే రాష్ట్రంలోని మొట్టమొదటి సెమీకండక్టర్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగింది. వికసిత భారత్ సాకారం కావాలంటే వికసిత ఉత్తరప్రదేశ్ అత్యవసరం" అని ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ పోటీలలో మంచిర్యాల విద్యార్థినికి సిల్వర్ మెడల్

తాండూర్ , ఫిబ్రవరి 23: రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ పోటీలలో మంచిర్యాల జిల్లా అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సిల్వర్ మెడల సాధించారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు హైదరాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ పోటీలలో 9వ తరగతి విద్యార్థి చౌల్ల హర్షిత పాల్గొని సిల్వర్ మెడల్‌తో పాటు రూ.15 వేల ప్రైజ్ మనీ గెలుచుకుందని పీడీ సాంబమూర్తి తెలిపారు.

ఈ సందర్భంగా హర్షిత విజయం పట్ల ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం వీ ఉమాదేవి, ఏఏపీసీ చైర్మన్ చిలకమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

## స్వామి వారి తత్త్వంపై అనుగ్రహ భాషణ



అమరావతి, ఫిబ్రవరి 23: మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానమందు నైమిశారణ్య శ్రీ వారాహి పీఠాధిపతులు, హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామివారిచే శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి తత్త్వంపై అనుగ్రహ భాషణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ ఉ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

స్వామివారు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి మహిమ, ఆధ్యాత్మిక తత్త్వం, భక్తి మార్గం, సనాతన ధర్మ పరిరక్షణ గురించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించి భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు గారు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహ భాషణాన్ని శ్రద్ధగా ఆస్వాదించారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, ఫిబ్రవరి 23(నేటి నిజం ప్రతినిధి) ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ ఎన్నికల కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుండి యథావిధిగా పునః ప్రారంభమై, జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించబడింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి, డిప్యూటీ కలెక్టర్ ఉమా హారతి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఆర్డీఓలు రాజేందర్, దేవుజ తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.



ప్రజావాణిలో మొత్తం 38 వినతులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా, ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ ప్రజావాణిలో విద్య, వైద్య, రెవెన్యూ, మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమం , గృహ నిర్మాణ, డీఆర్‌డీఓ, డీటీఓ, నీటిపారుదల, సర్వే & ల్యాండ్ రికార్డ్స్, బీసీ సంక్షేమం , పంచాయతీ రాజ్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి.

# ప్రశాంత వాతావరణంలో పరీక్షలు..

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

అమరావతి, ఫిబ్రవరి 23: ఇంటర్మీడియట్ పరీక్షలు విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా

23వ తారీకు నుండి మార్చి నెల 24 తారీకు వరకు జరుగు జవాబులు రాయాలని విద్యార్థులకు ఆయన తెలిపారు.



ఎక్కడికక్కడ పక్కాగా ఏర్పాటు చేయాలని పోలవరం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో ఆయన రంపచోడవరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆకస్మికంగా పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటర్మీడియట్ కేంద్రంలో లైట్లు, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, త్రాగునీటి సౌకర్యం తదితరవి ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులు ఒకటికి రెండుసార్లు కొచ్చిన్ పేపర్ చదివి వచ్చిన ప్రశ్నలకు ముందుగా ప్రతి ఇంటర్మీడియట్ కేంద్రంలో మాస్ కాపింగ్ లకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

## ఒకే రిజిస్ట్రేషన్ రూ.కోటి రెండు లక్షల 87 వేల 200 ఆదాయం

### గోదావరిఖనిలో భారీ షాపింగ్ మాల్ ఏర్పాటుకు స్థల రిజిస్ట్రేషన్

గోదావరిఖని, ఫిబ్రవరి 23: ఒకే డాక్యుమెంటు రిజిస్ట్రేషన్‌తో రిజిస్ట్రేషన్ శాఖకు రూ.కోటి రెండు లక్షల 87 వేల 200 ఆదాయం సమకూరింది. రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం గోదావరిఖనిలో ఏర్పాటు చేయనున్న భారీ షాపింగ్ మాల్ డిమార్ట్ కు సంబంధించి 56 గుంటల స్థలం రిజిస్ట్రేషన్ చేశారు. దీనికి సంబంధించి రూ.కోటికి పైగా ఆదాయం సబ్ రిజిస్టర్ కార్యాలయానికి లభించింది.

గత కొద్ది రోజుల క్రితమే షాపింగ్ మాల్ నిర్మాణ అనుమతుల కోసం రామగుండం కార్పొరేషన్ కార్యాలయానికి రూ.48 లక్షల చెల్లించి భవన నిర్మాణ అనుమతులు పొందారు. గోదావరిఖని పట్టణంలో భారీ షాపింగ్ మాల్ నిర్మించడానికి స్థలాన్ని కొనుగోలు చేసినప్పటికీ గత కొన్ని సంవత్సరాలుగా వివాదం నెలకొని ఇబ్బందులెదరయ్యాయి. వాటన్నిటినీ అధిగమించి సోమవారం గోదావరిఖని పట్టణంలోని మాతంగి కాలనీ అలేఖ్య థియేటర్ కు చెందిన 56 గుంటల స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. గత కొంతకాలం క్రితమే రామగుండంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం పనులు ప్రారంభమయ్యాయి.

కొద్ది రోజుల క్రితం కేశవరం సిమెంట్ ఫ్యాక్టరీ కి సంబంధించి భారీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా రూ.5 కోట్లకు పైగా ఆదాయం లభించిందని ఆ తర్వాత సోమవారం కోటికి పైగా ఆదాయం రావడం సంతోషంగా ఉందని సబ్ రిజిస్టర్ కార్యాలయ అధికారులు పేర్కొంటున్నారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

జైనూర్, ఫిబ్రవరి 23: వాహనదారులు రోడ్డు నిబంధనలు వాహన నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జైనూర్ సిఐ రమేష్ అన్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పిఐ ఎస్పీ ఆదేశాల మేరకు జై నూర్ మండల కేంద్రంలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో అలై అరయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూవాహనదారులు వాన పత్రాలు కలిగి ఉండాలని ఎలిమెంట్ ధరించి ఈ చక్ర వాహనాలను నడపాలని వాహనాల అన్ని రకాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని ఆయన కోరారు.ద్విచక్ర వాహనాలు నడిపేవారు ఎలిమెంట్ ధరించి నడపాలని నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దాదాపు పత్రాలు లేని నెంబర్లు లేని కొన్ని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు చేసుకున్నామని వాహనాల పత్రాలు పరిశీలించిన తర్వాత వాహనదారులకు వాహనాలను అప్పగించడం జరుగుతుందని పత్రాలు లేని వాహనాల దారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ పేర్కొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్, ఉద్యోగులు..



చౌటుప్పల్, ఫిబ్రవరి 23: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల నూతన తహసిల్దార్ కార్యాలయం ను సోమవారం ఆర్డీఓ వెలమ శేఖర్ రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో ఉండడం వలన అద్దె కట్టడం భారంగా మారుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు అద్దె భవనంలో కొనసాగుతున్న చౌటుప్పల్ మండల తహసిల్దార్ కార్యాలయం ను పట్టణంలోని పద్మావతి ఫంక్షన్ హాల్ ప్రక్కన ఉన్న టి ఎల్ కె విల్లాస్ నూతన ప్రభుత్వ భవనంలోకి మార్చడం జరిగింది.

మండల తహసిల్దార్ బి వీరాబాయి నూతన కార్యాలయంలో అర్చక స్వాముల ఆశీర్వాదంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసిల్దార్ వీరాబాయి లు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం, భూముల రిజిస్ట్రేషన్ ల కోసం తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులు, ఇతరులు పాత కార్యాలయానికి వెళ్ళకుండా నూతనంగా ప్రారంభించిన తహసిల్దార్ కార్యాలయానికి రావాలని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సిద్ధార్థ కుమార్ రెడ్డి, మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శర్మ, రెవెన్యూ గిర్దావర్లు బాణాల రామ్ రెడ్డి, కొప్పుల సుధాకర్ రావు తదితర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 25నుంచి పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ..

## -పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



కరీంనగర్, ఫిబ్రవరి 23: పెద్దపల్లి జిల్లాలో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్లు జెల్ల అరుణశ్రీ, దాసరి వేణుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

జిల్లాలో జనరల్, వోకేషనల్ కలిపి మొత్తం 10,367 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని, వీరి కోసం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల వరకు ఎటువంటి పార్కింగ్ ఉండోద్దని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షకు సకాలంలో హాజరయ్యేందుకు అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్‌లలో స్పెషల్ బస్సులు నడపాలని సూచించారు.

పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కల్పన, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఏసీపీ జి. కృష్ణ, కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు ఆకుల వెంకటేష్, రమేష్, సంబంధిత అధికారులు, చీఫ్ సూపరెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.


# యూనివర్సిటీలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ఆరోపిస్తూ కళ్లకు గంతలతో నిరసన



అమరావతి, ఫిబ్రవరి 23: రాయలసీమ యూనివర్సిటీలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ఆరోపిస్తూ రిజిస్ట్రార్‌ను వెంటనే పదవి నుండి తొలగించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, పిడిఎస్యు, ఆర్పిఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ముందు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన చేపట్టాయి. అనంతరం వైస్ చాన్సలర్ క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనను ఉధృతం చేశాయి.

ఈ సందర్భంగా ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్ కుమార్, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్, ఆర్పిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ యూనివర్సిటీలో రోజురోజుకు అవినీతి పెరుగుతోందని విమర్శించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలు అధికారులకు కనిపించడం లేదా లేక యూనివర్సిటీ ఖజానా పూర్తిగా ఖాళీ అయ్యే వరకు చూడరా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. రూసా నిధుల వినియోగం, కాన్వొకేషన్ బిల్లులు, టెండర్ల ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ముందుగా పనులు పూర్తి చేసి తరువాత టెండర్ల నాటకం ఆడుతూ నచ్చిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టి కమిషన్ల దందా నడుపుతున్నారని విమర్శించారు. అర్హతలేని వారితో కొటేషన్లు వేయించి యూనివర్సిటీ నిధులకు గండి కొడుతున్నారని ఆరోపించారు. రిజిస్ట్రార్‌పై తరచూ వెలువడుతున్న వార్తలతో విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ దెబ్బతింటోందని పేర్కొన్నారు.

# అత్యంత వైభవంగా శిరీష్ వివాహ వేడుకలు



హైదరాబాద్, ఫిబ్రవరి 23: యువ నటుడు అల్లు శిరీష్ వివాహ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వచ్చేనెల (మార్చి) 6న నయనికా రెడ్డితో శిరీష్ వివాహం జరగబోతోంది. ఈ క్రమంలో అల్లు వారి ఇంట్లో పెళ్లి పనులు వేగవంతమయ్యాయి. సంప్రదాయబద్ధంగా కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో ఈ వేడుకలు సాగుతున్నాయి.

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ దంపతులు పెళ్లి పిలుపుల్లో భాగంగా అల్లు శిరీష్ కలిసి జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మెగా బ్రదర్ నాగబాబు నివాసానికి వెళ్లారు. పవన్, లెజినోవా దంపతులకు స్వయంగా పెళ్లి పత్రికను అందించి వివాహానికి ఆహ్వానించారు. అలాగే నాగబాబు దంపతులకు కూడా పెళ్లి పత్రికను అందించి వివాహానికి ఆహ్వానించారు.

# అభివృద్ధియే మా లక్ష్యం

నిజామాబాద్ ఫిబ్రవరి 23: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ పట్టణంలోని మున్సిపాలిటీలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ బోదిరే నాగమణి, వైస్ చైర్ పర్సన్ సంటి లత, కౌన్సిలర్ పర్శ కుశలత,(అనంతరావు) అంజు అలీ,ఆరేపల్లి శ్రీజ (నాగేంద్రబాబు,) తోట సతీష్, సంగ్య నాయక్, రెండు ఎస్సి వాడ సంఘాల సభ్యులు, ఆధ్వర్యంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డులలో అభివృద్ధి కొరకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందజేస్తామని తెలిపారు. విజయం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోదిరే స్వామి, జేజే నర్సయ్య, కౌన్సిలర్ పర్శ కుశలత, (అనంతరావు) అంజు అలీ,ఆరేపల్లి శ్రీజ (నాగేంద్రబాబు,) తోట సతీష్, లను ఈ సందర్భంగా రెండు ఎస్సి వాడ సంఘాల సభ్యులు నాయకులకు పూల మాల, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు వార్డులకు చెందిన ఎస్సి వాడ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'సంత్ సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'

## -నల్లగొండ కలెక్టర్ బి.చంద్రశేఖర్

రామగిరి, ఫిబ్రవరి 23 : నీతి, నిజాయితీ, ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సంత్ సేవలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకుని సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ లంబాడా, గిరజన జాతిలోని మూఢ నమ్మకాలను పారద్రోలి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో రూపొందించిన రాజ్యాంగం, హక్కులు, ప్రభుత్వ పథకాలను పేద, నిమ్న వర్గాలకు అందించేందుకు ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. ఎస్టీ, బంజారాలకు సమాజ స్థితిగతులను తెలియజేశారని, సంత్ సేవాలాల్ నీతి, న్యాయం, ధర్మాన్ని పాటించాలన్న వారి మార్గదర్శకాలను, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆధ్యాత్మిక గురువని, సేవ, ధర్మం సమ భావనలను బోధించారని, సత్సంగ్ ద్వారా సమాజాన్ని మంచి మార్గంలో పయనించేందుకు కృషి చేశారన్నారు. సమావేశానికి ప్రవీణ్ నాయక్ అధ్యక్షత వహించగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, లంబాడ హక్కుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్, ఎరుకల సంఘం అధ్యక్షుడు నరసింహ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేశ్, డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, తాసిల్దార్ పరశురాం, కార్పొరేటర్లు దీప్లా నాయక్, నాగార్జున, రవి నాయక్ పాల్గొన్నారు.

# 'రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగుల పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలి..'


మెదక్, ఫిబ్రవరి 23: సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సంగారెడ్డి జిల్లా తపస్ అధ్యక్షుడు దత్తాత్రి డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని స్థానిక యుపిఎస్ నెం.3 జహీరాబాద్ పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన వెంటనే పెండింగ్ బిల్లులు అన్ని ఒకే సారి విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం నెలల వారీగా విడుదల చేస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల ఏరియర్స్ బిల్స్ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంతవరకు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. ఫిబ్రవరి నెల విడుదల చేసే రూ. 700 కోట్ల రూపాయలలో సీపీఎస్ ఉద్యోగుల పెండింగ్ బిల్స్ విడుదల చేయాలని కోరారు. ఏరియా బిల్స్ వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం సమగ్ర శిక్షా, కేజీబీవీ ఉద్యోగులు చేసిన సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నాకు స్ఫూర్తి..

## -కాంగ్రెస్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆసక్తికర వ్యాఖ్యలు




కరీంనగర్, ఫిబ్రవరి 23: నర్సాపూర్ మున్సిపాలిటీలో సోమవారం నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్ల మొదటి సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తనకు స్ఫూర్తి అని, ఆదర్శప్రాయమన్నారు.

సాధారణంగా ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు వేరే పార్టీ ప్రతినిధులను పొగడడం కష్టతరమే. కానీ నర్సాపూర్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఒక్కసారి ఆకాశానికి ఎత్తడంతో అక్కడున్న కౌన్సిలర్స్, సిబ్బంది కాసింత ఆశ్చర్యానికి లోనయ్యారు.

మున్సిపల్ చైర్ పర్సన్ ప్రసంగంలో తనకు మద్దతు పలికిన బీజేపీ కౌన్సిలర్లను గానీ, తన పదవికి సహకరించిన కాంగ్రెస్ పెద్దల గురించి గాని సంభాషించకుండా కేవలం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని పొగడడం ఏంటని అక్కడున్న వారందరు అవాక్కయ్యారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మనస్థత్వం ప్రజలనే కాకుండా ఇతర పార్టీ ప్రజాప్రతినిధులను సైతం గెలుచేసుకుంటుందని బీఆర్ఎస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు.

అనంతరం చైర్పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ మాట్లాడుతూ.. పార్టీల పరంగా కాకుండా కుటుంబ సభ్యులుగా ఉంటూ నర్సాపూర్ మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మహిళ అయినప్పటికి ఎంతో ఉన్నతి సాధించారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజుయాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని భరోసానిచ్చారు.

# దేశ పౌరుల సాఫల్యాలను ప్రస్తావించేందుకు 'మన్ కీ బాత్' ఒక శక్తిమంతమైన వేదిక

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23: 'మన్ కీ బాత్' కార్యక్రమానికి మీ అందరికీ స్వాగతం. అభినందనలు. దేశ విజయాలను, దేశ పౌరుల సాఫల్యాలను ప్రస్తావించేందుకు 'మన్ కీ బాత్' ఒక శక్తిమంతమైన వేదిక. ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా దేశం అలాంటి విజయాన్ని చవిచూసింది. అనేక దేశాల నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్ట్-అప్ రంగంతో సంబంధం ఉన్నవారు ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం భారత్ మండపంలో సమావేశమయ్యారు. కృత్రిమ మేధా శక్తిని భవిష్యత్తులో ప్రపంచం ఎలా ఉపయోగించుకుంటుందో చెప్పడానికి ఈ సమ్మేళనాన్ని ఒక కీలక మైలురాయిగా చెప్పవచ్చు.

ఈ సమ్మేళనంలో ప్రపంచ దేశాల నాయకులు, సాంకేతిక సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారులతో సమావేశమయ్యే అవకాశం నాకు లభించింది. ఏఐ సమ్మిట్ ఎగ్జిబిషన్‌లో ప్రపంచ నాయకులకు నేను చాలా విషయాలు చూపించాను. నేను ముఖ్యంగా రెండు విషయాలను ప్రస్తావించాలనుకుంటున్నాను. ఈ రెండు ఉత్పత్తులు సమ్మిట్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నాయకులను బాగా ఆకట్టుకున్నాయి. మొదటి ఉత్పత్తిని అమూల్ సంస్థ ప్రదర్శించింది. జంతువుల ఆరోగ్య పరిరక్షణలో కృత్రిమ మేధ మనకు ఎలా సహాయపడుతుందనే విషయాన్ని ఇందులో వివరించారు. ప్రతిరోజూ నిరంతరం కృత్రిమ మేధ సహాయంతో రైతులు వారి డైరీ లెక్కలను, జంతువుల గణనను ఎలా సరి చూస్తారో ఇందులో పేర్కొన్నారు.

రెండవ ఉత్పత్తి మన సంస్కృతికి సంబంధించింది. మన పురాతన గ్రంథాలను, మన పురాతన జ్ఞానాన్ని, మన లిఖిత ప్రతులను కృత్రిమ మేధ సహాయంతో సంరక్షిస్తున్న తీరును, నేటి తరానికి అనుగుణంగా వాటిని మారుస్తున్న విధానాన్ని చూసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాయకులు ఆశ్చర్యపోయారు.

ఈ ఎగ్జిబిషన్ సందర్భంగా శుశ్రుత సంహితను ప్రదర్శనకు ఉంచారు. సాంకేతికత సహాయంతో మనం లిఖితప్రతుల ఇమేజీల నాణ్యతను మెరుగుపరుస్తూ, వాటిని చదవగలిగేలా చేస్తున్న విధానాన్ని మొదటి దశలో చూపించారు. రెండవ దశలో ఈ చిత్రాన్ని యంత్రం చదవగలిగే వచనంగా మార్చారు. తదుపరి దశలో యంత్రం-చదవగలిగే వచనాన్ని ఏఐ అవతార్ ద్వారా చదివించారు. ఆ తర్వాతి దశలో సాంకేతికత సహాయంతో ఈ విలువైన భారతీయ జ్ఞానాన్ని భారతీయ, విదేశీ భాషలలోకి ఎలా అనువదించవచ్చో కూడా మనం ప్రదర్శించాం. ఆధునిక అవతార్ ద్వారా భారతదేశ పురాతన జ్ఞానం గురించి తెలుసుకోవడానికి ప్రపంచ నాయకులు చాలా ఆసక్తిని చూపించారు.

ఈ శిఖరాగ్ర సమ్మేళనంలో కృత్రిమమేధా రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచం దర్శించింది. ఈ సందర్భంగా భారతదేశం మూడు మేడ్ ఇన్ ఇండియా ఏఐ మోడళ్లను కూడా ప్రారంభించింది. ఇది ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఏఐ శిఖరాగ్ర సమ్మేళనం. ఈ శిఖరాగ్ర సమ్మేళనం పట్ల యువత ఉత్సాహం, ఆసక్తి స్పష్టంగా కనిపించాయి. ఈ శిఖరాగ్ర సమ్మేళనం విజయవంతం అయినందుకు నా దేశవాసు లందరినీ నేను అభినందిస్తున్నాను.

'ఆడేవారు వికసిస్తారు' అని నేను తరచుగా చెప్తూ ఉంటాను. క్రీడలు మనల్ని ఏకం చేస్తాయి. ఈ రోజుల్లో మీరు టి-20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను చూస్తూ ఉంటారు. మ్యాచ్‌లను చూస్తున్నప్పుడు మీ కళ్లు తరచుగా ఒక ఆటగాడి వైపు ఆకర్షితమై ఉంటాయని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. వారు ధరించిన జెర్సీ వేరే దేశానికి చెందినది కావచ్చు. కానీ ఆ పేరు వినగానే "ఆ క్రీడాకారుడు మన దేశానికి చెందినవాడే'' అని మీరు భావిస్తారు. అప్పుడు హృదయం ఒక చిన్న ఆనందంతో నిండిపోతుంది. ఎందుకంటే ఆ క్రీడాకారులు భారతీయ సంతతికి చెందినవారు. వారి కుటుంబం స్థిరపడిన దేశం కోసం ఆడుతున్నారు. వారు తమ తమ దేశాల జెర్సీని ధరించి మైదానంలోకి ప్రవేశిసారు. హృదయపూర్వకంగా ఆ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. కెనడా జట్టులో అత్యధిక సంఖ్యలో భారత సంతతికి చెందిన ఆటగాళ్ళు ఉన్నారు. జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బాజ్వా పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో జన్మించారు. నవనీత్ ధలివాల్ చండీగఢ్ కు చెందినవారు. ఈ జాబితాలో హర్ష్ ఠాకర్, శ్రేయస్ మోవా వంటి వారు ఉన్నారు. వీరు కెనడా, భారతదేశం- రెండింటికీ గర్వకారణం. అమెరికన్ జట్టులో చాలా మంది భారత దేశీయ క్రికెట్ నుండి ఎదిగారు. అమెరికన్ జట్టు కెప్టెన్ మోనాంక్ పటేల్ గుజరాత్ అండర్-16, అండర్-18 జట్లకు కూడా ఆడారు. ముంబాయికి చెందిన సౌరభ్, హర్మీత్ సింగ్, ఢిల్లీకి చెందిన మిలింద్ కుమార్ - అందరూ అమెరికన్ జట్టుకు గర్వకారణం. నేడు ఒమన్ జట్టులో భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో ఆడిన చాలా మంది ఆటగాళ్లున్నారు. జతీందర్ సింగ్, వినాయక్ శుక్లా, కరణ్, జయ్, ఆశిష్ వంటి ఆటగాళ్ళు ఒమన్ క్రికెట్‌కు బలమైన స్తంభాలు. న్యూజిలాండ్, యుఎఇ, ఇటలీ జట్లలో కూడా భారత సంతతికి చెందిన ఆటగాళ్ళు తమ ముద్ర వేస్తున్నారు. తమ దేశానికి గర్వకారణంగా నిలుస్తూ, అక్కడి యువతకు ప్రేరణగా మారుతున్న అనేక మంది భారత సంతతికి చెందిన ఆటగాళ్ళు ఉన్నారు. ఇదే భారతీయత సారాంశం. భారతీయులు ఎక్కడికి వెళ్లినా వారు తమ మాతృభూమి మూలాలతో అనుసంధానమై ఉంటారు. వారు తమ పని ప్రదేశమైన తాము నివసించే దేశం అభివృద్ధికి కూడా దోహదపడతారు.

ఏ తల్లిదండ్రులకైనా తమ బిడ్డను కోల్పోవడం కంటే గొప్ప దుఃఖం లేదు. చిన్న బిడ్డను కోల్పోవడం వల్ల కలిగే బాధ మరింత ఎక్కువగా ఉంటుంది. కొన్ని రోజుల కిందట కేరళకు చెందిన ఆలిన్ షెరిన్ అబ్రహాం అనే చిన్న పాపను మనం కోల్పోయాం. ఆ పాప కేవలం 10 నెలల వయసులోనే మరణించింది. ఊహించుకోండి - ఆమె ముందు మొత్తం ఎంతో భవిష్యత్ జీవితం ఉంది. ఆ జీవితమంతా అకస్మాత్తుగా ముగిసిపోయింది. చాలా కలలు, ఆనందాలు నెరవేరలేదు. ఆమె తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధ మాటల్లో చెప్పలేనిది. కానీ ఇంత తీవ్రమైన బాధ మధ్య కూడా ఆలిన్ తండ్రి అరుణ్ అబ్రహాం, తల్లి షెరిన్ ప్రతి పౌరుడి హృదయాన్ని గర్వంతో నింపే నిర్ణయం తీసుకున్నారు. వారు ఆలిన్ అవయవాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ ఒక్క నిర్ణయం వారి లోతైన దృష్టిని, వారి విశాల వ్యక్తిత్వాన్ని వెల్లడిస్తుంది. ఒకవైపు వారు తమ కుమార్తెను కోల్పోయినందుకు దుఃఖిస్తున్నారు. అదే సమయంలో ఇతరులకు సహాయం చేయాలనే గొప్ప భావనతో కూడా వారు నిండిపోయారు. ఏ కుటుంబం కూడా ఇలాంటి విధిని ఎదుర్కోకూడదని వారు కోరుకున్నారు. ఆలిన్ షెరిన్ అబ్రహాం ఇప్పుడు మన మధ్య లేదు. కానీ ఆమె పేరు దేశంలోని అతి పిన్న వయస్కులైన అవయవ దాతల జాబితాలో చేరింది. మిత్రులారా! ఈ రోజుల్లో భారతదేశంలో అవయవ దానం గురించి అవగాహన క్రమంగా పెరుగుతోంది. ఇది అవసరంలో ఉన్నవారికి సహాయం చేస్తోంది. వైద్య పరిశోధనలను కూడా ఇది బలోపేతం చేస్తోంది. భారత దేశంలో ఈ దిశలో అసాధారణమైన పని చేస్తున్న అనేక సంస్థలున్నాయి. ఎందరో వ్యక్తులు కూడా ఉన్నారు.

అవయవ దానం ద్వారా ఇతరులకు రెండవ జీవితాన్ని ఇచ్చిన కేరళకు చెందిన ఆలిన్ లాంటి చాలా మంది ఉన్నారు. ఉదాహరణకు ఢిల్లీకి చెందిన లక్ష్మీ దేవి గత సంవత్సరం కేదార్‌నాథ్‌కు 14 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేసి ప్రయాణించారు. గుండె మార్పిడి తర్వాత ఆమె ఈ ప్రయాణం చేశారని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఆమె గుండె కేవలం 15 శాతం మాత్రమే పనిచేస్తోంది. మరణించిన దాత నుండి ఆమెకు గుండె వచ్చింది. ఆమె జీవితం పూర్తిగా మారిపోయింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన గౌరంగ్ బెనర్జీ సముద్ర మట్టానికి 14,000 అడుగుల ఎత్తులో ఉన్న నాథులాకు రెండుసార్లు వెళ్ళారు. ఊపిరితిత్తుల మార్పిడి తర్వాత ఈ ఘనతను సాధించారు. రాజస్థాన్‌లోని సీకర్‌కు చెందిన రామ్‌దేవ్ సింగ్ కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. నేడు ఆయన క్రీడా కార్యకలాపాలలో రాణిస్తున్నారు. మిత్రులారా! మీకు ఇలాంటి స్ఫూర్తిదాయకమైన ఉదాహరణలు చాలా కనిపిస్తాయి. ఒక వ్యక్తి చేసే గొప్ప పని లెక్కలేనంత మంది జీవితాలను మార్చగలదని ఇది మరోసారి రుజువు చేస్తుంది. అటువంటి గొప్ప పనులను చేపట్టిన వారందరినీ నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

నా ప్రియమైన దేశవాసులారా! స్వాతంత్ర్య అమృత మహోత్సవం సందర్భంగా నేను ఎర్రకోట నుండి ఐదు ప్రాణశక్తుల గురించి మాట్లాడాను. వాటిలో ఒకటి బానిస మనస్తత్వం నుండి విముక్తి. నేడు దేశం బానిసత్వ చిహ్నాలను వదిలి భారతీయ సంస్కృతికి సంబంధించిన వాటికి విలువ ఇవ్వడం ప్రారంభించింది. మన రాష్ట్రపతి భవన్ కూడా ఈ దిశలో ఒక ముఖ్యమైన అడుగు వేసింది. రేపు- ఫిబ్రవరి 23వ తేదీన రాష్ట్రపతి భవన్‌లో 'రాజాజీ ఉత్సవ్' జరుగుతుంది. ఈ సందర్భంగా రాష్ట్రపతి భవన్ కేంద్రీయ ప్రాంగణంలో సి. రాజగోపాలాచారి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. రాజగోపాలాచారి స్వతంత్ర భారతదేశానికి తొలి భారతీయ గవర్నర్ జనరల్. అధికారాన్ని ఒక పదవిగా కాకుండా సేవగా భావించిన వారిలో ఆయన ఒకరు. ప్రజా జీవితంలో ఆయన ఆచరణ, ఆత్మ సంయమనం, స్వతంత్ర చింతన నేటికీ మనకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. దురదృష్టవశాత్తూ స్వాతంత్ర్యం తర్వాత కూడా బ్రిటిష్ పరిపాలకుల విగ్రహాలను రాష్ట్రపతి భవన్‌లో ఉంచడానికి అనుమతించారు. కానీ ఎంతో గొప్పవారైన దేశపుత్రుల విగ్రహాలకు స్థానం ఇవ్వలేదు. బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుట్యెన్స్ విగ్రహాన్ని కూడా రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ విగ్రహం స్థానంలో రాజాజీ విగ్రహం ఉంటుంది. రాజాజీ ఉత్సవ్ సందర్భంగా రాజగోపాలాచారిపై ప్రదర్శన కూడా జరుగుతుంది. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 24వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు జరుగుతుంది. మీకు అవకాశం ఉంటే దయచేసి దీన్ని సందర్శించండి.

డిజిటల్ అరెస్ట్ గురించి నేను గతంలో 'మన్ కీ బాత్'లో మీతో వివరంగా మాట్లాడాను. దీని తర్వాత డిజిటల్ అరెస్ట్, డిజిటల్ మోసాలపై మన సమాజంలో చాలా అవగాహన వచ్చింది. అయితే ఇటువంటి సంఘటనలు ఇప్పటికీ మన చుట్టూ జరుగుతున్నాయి. ఇవి క్షమించరానివి. డిజిటల్ అరెస్టుకు, ఆర్థిక మోసానికి అమాయకులు గురవుతున్నారు. చాలా సార్లు సీనియర్ సిటిజన్ల జీవిత కాల పొదుపు మొత్తాన్ని కూడా మోసంతో తీసుకున్నట్టు వెల్లడైంది.

# డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ధర్నా




నల్లగొండ, ఫిబ్రవరి 23 : అక్రిడిటేషన్ల విషయంలో డెస్క్ జర్నలిస్టులకు చాలా అన్యాయం జరుగుతోందని, అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య పెంచి అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) ఆధ్వర్యంలో సోమవారం వివిధ పత్రికల డెస్క్ జర్నలిస్టులు సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల సంఖ్య భారీగా తగ్గించారని, గతంలో ప్రతి జిల్లాకు ఐదుగురికి, ఎడిషన్ సెంటర్‌లో 8 మంది డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వగా ప్రస్తుతం కేవలం ఎడిషన్ సెంటర్‌కు నాలుగు అక్రిడిటేషన్లు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టారని, ఈ నిబంధన వల్ల చాలామంది డెస్క్ జర్నలిస్టులు అక్రిడిటేషన్లకు దూరం అవుతున్నారని మండిపడ్డారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పనిచేసినా ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్క్‌లు వేరుగా ఉంటాయని ప్రతి జిల్లాకు ఒక ఇన్‌చార్జితో పాటు నలుగురు సబ్ ఎడిటర్లు ఉంటారన్నారు.

జీఓ ప్రకారం ఎడిషన్‌కు నాలుగు కార్డులే ఇస్తే కనీసం ఆ జిల్లాల ఇన్‌చార్జిలకు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

రాత్రివేళల్లో పనిచేసే తాము తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేనివాళ్లమని, కనీసం అక్రిడిటేషన్ కార్డు ఉంటే హెల్త్ కార్డు అయినా తమకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి డెస్క్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్లు వచ్చేలా చూడాలని కోరారు. ఈ ధర్నాకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే 143, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు గుండగోని జయశంకర్, యరెడ్ల చంద్రశేఖర్, గాదె రమేశ్, సాదత్ అలీ, డెస్క్ జర్నలిస్టులు పగడాల సురేశ్, మేకల వరుణమ్మ, ఎండీ. జమాలుద్దీన్, ఎస్‌డీ. జాకీర్, శ్రీనివాస్, ప్రవీణ్, నరేందర్, సైదిరెడ్డి, అరవింద్‌రెడ్డి, నరేశ్, తిరుమలేశ్, సందీప్, శ్రీను, గిరి, పుష్పలత, భార్గవి పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం

## –హాజరైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 23 : కొత్తగూడెం కార్పొరేషన్‌లో గెలిచిన బీఆర్ ఎస్ కార్పొరేటర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కమిషనర్ సుజాత అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబాశివరావు, మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి హాజరయ్యారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో సింధు తపస్వి. మల్లెల స్వప్న, వీరమ్మ, భీమా శ్రీవల్లి, మల్హోత్రా సాగర్, మధు చంద్, గుణ చరిత, రాంబాబు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాపు సీతాలక్ష్మి, మంతపురి రాజు గౌడ్, శ్రీధర్, కనకేష్ పటేల్, రమాకాంత్, దామోదర్ పాల్గొన్నారు.

# గుంటూరులో మెగా జిడిఎస్ సమ్మేళన్ నిర్వహిస్తున్న తపాలా శాఖ



అమరావతి, ఫిబ్రవరి 23: ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లోని తపాలా శాఖ, ఫిబ్రవరి 22, 2026న గుంటూరులో గ్రాండ్ గ్రామీణ డాక్ సేవక్ (ఉఆూ) సమ్మేళన్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సర్కిల్ అంతటా 9,000 మందికి పైగా గ్రామీణ డాక్ సేవకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, గ్రామీణ తపాలా సేవలను బలోపేతం చేయడంలో వారి సమిష్టి నిబద్ధత మరియు అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ సమ్మేళనానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు, కేంద్ర కమ్యూనికేషన్లు మరియు ఆూఔఇఖీ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా, కమ్యూనికేషన్లు మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పోస్టల్ సర్వీసెస్ బోర్డు సభ్యుడు (పర్సనల్), శ్రీ సువేందు కుమార్ స్వైన్, ఎమ్మెల్యే శ్రీ మొహమ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు మేయర్ శ్రీ కోవెలమూడి రవీంద్ర, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా, పోస్టాఫీసు పొదుపు పథకాలు, సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మరియు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) సేవలను అందించడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పది మంది గ్రామీణ డాక్ సేవకులను సత్కరించారు. కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా తపాలా కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, గ్రామీణ డాక్ సేవకులను దేశంలోని ప్రతి మూలను అనుసంధానించే కీలక శక్తిగా అభివర్ణించారు. ఇండియా పోస్ట్ ప్రస్తుతం దాదాపు 38 కోట్ల పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలను దాదాపు ?22 లక్షల కోట్ల డిపాజిట్లతో నిర్వహిస్తుందని ఆయన తెలియజేశారు. అదనంగా, దాదాపు 3.8 కోట్ల సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు సుమారు ?2.27 లక్షల కోట్ల డిపాజిట్లను కలిగి ఉన్నాయి, ఇది తపాలా నెట్‌వర్క్ ద్వారా సాధించిన ఆర్థిక చేరిక స్థాయిని ప్రతిబింబిస్తుంది.

సామర్థ్యాన్ని పెంచడానికి ఇండియా పోస్ట్ యొక్క మెయిల్ మరియు లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను కన్వేయర్ సిస్టమ్‌లు, శాస్త్రీయ సార్టింగ్, ఖీఈఎఆ, బార్‌కోడ్‌లు మరియు ఖీఖీ-కోడ్-ఎనేబుల్డ్ ట్రాకింగ్‌తో వేగంగా ఆధునీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జమ్మూ ఒ కాశ్మీర్, ఉత్తరాఖండ్ మరియు హిమాచల్ ప్రదేశ్ వంటి కొండ ప్రాంతాలలో, చివరి మైలు కనెక్టివిటీని బలోపేతం చేయడానికి డ్రోన్ ఆధారిత డెలివరీ వ్యవస్థలను కూడా ప్రవేశపెడుతున్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ "సంస్కరించు, పనితీరు మరియు పరివర్తన'' అనే పిలుపుకు అనుగుణంగా, విక్షిత్ భారత్ 2047 అనే దార్శనికతను సాకారం చేసుకోవడానికి సమిష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

# 'గులామీ కి మాన్సిక్తా సే ముక్తి' అనే దార్శనికతతో చేపట్టిన మార్పులు కేవలం ప్రతీకాత్మకమైనవి కావు

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23: భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన 'రాజాజీ ఉత్సవ్'కు హాజరయ్యారు. ఈ సందర్భంగా, భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఎడ్విన్ లుటియెన్స్ స్థానంలో సి. రాజగోపాలాచారి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

సభను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, రాజాజీ విగ్రహాన్ని ఆవిష్కరించడం వలసవాద ప్రభావం యొక్క అవశేషాలను తొలగించడంలో మరో ముఖ్యమైన అడుగు అని అన్నారు. భారత దేశం వలసవాద ప్రభావం నుండి వైదొలగడం అనేది ఒకే ఒక్క సంఘటన కాదని, పాలన, చట్టం, విద్య, సంస్కృతి మరియు జాతీయ గుర్తింపు అంతటా కొనసాగుతున్న పరివర్తన అని ఆయన నొక్కి చెప్పారు. బ్రిటిష్ పాలనలో సంస్థలు మరియు వైఖరులను రూపొందించిన వలసవాద మనస్తత్వం నుండి విముక్తి కోసం నిరంతరం పిలుపునిచ్చిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ దార్శనికత ఈ సంస్కరణల కేంద్రబిందువు అని ఆయన పేర్కొన్నారు.

రాజ్ భవన్‌లను లోక్ భవన్‌లుగా మార్చడం; ప్రధాన మంత్రి కార్యాలయాన్ని సేవా తీర్థంగా మార్చడం; కేంద్ర సచివాలయాన్ని కర్తవ్య భవన్‌గా పేరు మార్చడం; వలసరాజ్యాల కాలం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో; ఇండియా గేట్ సమీపంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం; మరియు జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని నిర్మించడం వంటి అనేక కార్యక్రమాల ద్వారా "గులామీ కి మాన్సిక్తా సే ముక్తి" అనే దార్శ నికతను కార్యరూపంలోకి తీసుకు వచ్చామని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

"ఈ మార్పులు కేవలం ప్రతీకాత్మకమైనవి కావు; అవి ప్రభుత్వ సేవా భావన స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి" అని ఆయన అన్నారు.

రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము నాయకత్వంలో రాష్ట్రపతి భవన్‌లో చేపట్టిన అనేక కార్యక్రమాలను ఆయన హైలైట్ చేశారు, వాటిలో తోటలను అమృత్ ఉద్యాన్‌గా ప్రారంభించడం; దర్బార్ హాల్‌ను గణతంత్ర మండప్‌గా పేరు మార్చడం; బ్రిటిష్ ఏఆఅల ఛాయాచిత్రాలను పరమ వీర చక్ర అవార్డు గ్రహీతల ఛాయా చిత్రాలతో భర్తీ చేయడం; మరియు భారతీయ శాస్త్రీయ భాషల ప్రత్యేక లైబ్రరీ మరియు రిపోజిటరీ అయిన 'గ్రంథ్ కుటీర్'ను ప్రారంభించడం వంటివి ఉన్నాయి. ఇటువంటి చర్యలు ప్రజా చైతన్యం నుండి వలసవాద ముద్రను తుడిచి వేయడానికి మరియు భారతదేశ నాగరిక విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి సహాయపడతాయని ఆయన గమనించారు.

# మద్యపాన నిషేధం అమలుకు భీమనపల్లి తీర్మానం

నల్గొండ, ఫిబ్రవరి 23: భూదాన్ పోచంపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామంలో మద్యపాన నిషేధం అమలుకు గ్రామ సర్పంచ్ కర్నాటి వరలక్ష్మి, నూతన పాలకవర్గం సోమవారం గ్రామ పంచాయతీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పాలకవర్గం హెచ్చరించింది. మార్చి 1వ తేదీ నుండి మద్యపాన నిషేధం అమలులోకి వస్తుందని, ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు. మద్యం అమ్మే వారికి గ్రామ పంచాయతీ నుండి నోటీసులు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కందాల సత్తిరెడ్డి, శేఖర్, రమా, సునీత, రాణి, లింగస్వామి, కవిత పాల్గొన్నారు.

# శివనగర్‌లో ఘనంగా మార్కండేయ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం



వరంగల్, ఫిబ్రవరి 23: గ్రేటర్ వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని శ్రీ శివ భక్త మార్కండేయ దేవాలయంలో ద్వితీయ వార్షిక మహోత్సవం కనుల పండువగా జరిగాయి. సోమవారం ఉదయం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, సామూహిక రుద్రాభిషేకాలు రుత్వికులు ఘనంగా నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని శ్రీ శివపార్వతీ సమేత భక్త మార్కండేయ, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అభయాంజనేయ, నవగ్రహాల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా చండీ హోమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

మంగళవారం ఉదయం దేవత హవనం, పూర్ణాహుతి అనంతరం శివపార్వతుల శాంతి కళ్యాణం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ, భవన నిర్మాణ సమితి కన్వీనర్ వడ్నాల సదానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో పరపతి సంఘం, భవన నిర్మాణ సమితి సభ్యులు, పాశికంటి రవికుమార్, ఊరుగొండ సారంగపాణి, పాశికంటి రాజేశ్వరరావు, రాపెల్లి చంద్రమౌళి, తౌటం మధు, శామంతుల బిక్షపతి, పూజారులు, కార్యవర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది కస్తూరి శ్రీనివాస్, భాస్కర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల..

## 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

హన్మకొండ, ఫిబ్రవరి 23: రాష్ట్రవ్యాప్తంగా 2026 విద్యాసంవత్సరానికి బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్నట్లు టీజీ ఎడ్‌సెట్-2026 పూర్తి షెడ్యూల్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విడుదల చేశారు. టీజీ ఎడ్‌సెట్- 2026 ఛైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి సోమవారం విశ్వవిద్యాలయం కామర్స్? అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 20న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు.

23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

23వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.750 పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు రూ.550 చెల్లించి దరఖాస్తు నమోదు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 15వ తేదీ చివరి గడువుగా నిర్ణయించినట్లు, రూ.250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 22 వరకు, మరోసారి రూ.250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 27 వరకు, రూ.1000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. మే 2వ తేదీ నుంచి దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని, మే 4వ తేదీన పరీక్షా కేంద్రాల కేటాయింపు జరుగుతుందన్నారు.

మే 15వ తేదీన ప్రాథమిక కీ విడుదల

రూ.5000 అపరాధ రుసుంతో మే 8 నుంచి 9 తేదీలలో ప్రత్యేక అవకాశాన్ని కల్పించనున్నట్లు, హాల్‌టికెట్లు మే 9వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష మే 12వ తేదీన ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు రెండు సెషన్లలో నిర్వహించబడుతుందని వారు తెలిపారు. మే 15వ తేదీన ప్రాథమిక కీ విడుదల చేయబడుతుందని, మే 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు. తుది ఫలితాలు మే 30వ తేదీన ప్రకటించబడతాయని వారు చెప్పారు.

ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ ఎన్.రామనాథకిషన్, ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ ఎడ్‌సెట్-2026 అధికారిక వెబ్‌సైట్‌ను వారు ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్-2026 నిర్వహణకు 16 నగరాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు, హైదరాబాద్‌ను నాలుగు భాగాలుగా, నల్గొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, సిద్దిపేట ఉన్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి తెలిపారు.

# ద్వారక పాఠశాలలో క్విజ్ పోటీలు..

నల్గొండ, ఫిబ్రవరి 23: దండేపల్లి మండలంలోని ద్వారక కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలలో ప్రైమరీ లెవెల్ క్విజ్ పోటీలను 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులతో సోమవారం నిర్వహించారు, నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటి స్థానంలో ప్రాథమిక పాఠశాల ద్వారక, రెండవ స్థానంలో మాదాపూర్, మూడవ స్థానంలో శ్రీరాములపల్లి కన్సోలేషన్ దొరగారిపల్లి, పాఠశాలలకు బహుమతులను జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ విజయలక్ష్మి, అందజేశారు.

క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల జిల్లా పరిశీలన బృందం సభ్యులు చక్రవర్తి ఎంఈఓ రాజు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ చిన్ననరసయ్య బహుమతులు అందజేశారు, ఈ కార్యక్రమంలో క్విజ్ మాస్టర్ గా సి ఆర్ పి సురేందర్ నిర్వహించారు, వీరితో పాటు వివిధ పాఠశాలల హెడ్మాస్టర్లు పిల్లలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి

## –ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నల్గొండ, ఫిబ్రవరి 23: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం భూదాన్ పోచంపల్లి మం డలంలోని అంతమ్మగూడెంలో ఎజోలా కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.90 లక్షలతో చేపట్టిన ఫంక్షన్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన , మహిళ స్త్రీ శక్తి భవనం, ఎన్ ఆర్ ఈ జి ఎస్ కింద సిసి రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే ఇందిరమ్మ నూతన ఇండ్ల గృహప్రవేశం, ధోతిగూడెంలో 33/11 కె.వి విద్యుత్ నూతన సబ్ స్టేషన్ కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవం చేశారు. వి.జే సాయి కెమికల్ కంపెనీని ఆయన సందర్శించారు. రసాయన కంపెనీలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోచంపల్లిలో జేవి ఫంక్షన్ హాల్ లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద 80 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోతిగూడెంలో ప్రభుత్వ పాఠశాలకు కొత్త బిల్డింగ్, మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ మల్లికార్జున, సుధీర్ కుమార్, ఏడీఈ కమరత్, ట్రాన్స్‌కో ఈఈ కె.శ్రీనివాస్, తాసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎం ఆర్ ఐ గుత్తా వెంకటరెడ్డి, జిల్లా నాయకులు తడక వెంకటేష్, కళ్లెం రాఘవరెడ్డి, సామ మధు సూదన్ రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవ కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొయ్యడ రజని శ్రీనివాస్ గౌడ్, నాయకులు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# ఉపరాష్ట్రపతి భవన్‌లో భారత ఉపరాష్ట్రపతిని కలిసిన గయానా ఉపరాష్ట్రపతి



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23: ఈ సమావేశంలో, విస్తృత శ్రేణి రంగాలలో భారతదేశం-గయానా సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి మార్గాలను ఇద్దరు నాయకులు చర్చించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ నిర్ణయాత్మక నాయకత్వాన్ని మరియు జఖఎ ద్వారా డిజిటల్ పాలన మరియు ఆర్థిక చేరికలో భారతదేశం వేగంగా ముందుకు సాగడాన్ని డాక్టర్ జగ్దియో ప్రశంసించారు. గయానాకు ఇలాంటి డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల నమూనాలను విస్తరించే అవకాశం గురించి ఇరుపక్షాలు చర్చించాయి.

ఆరోగ్య సంరక్షణ పరిపాలన మరియు ఆసుపత్రి నిర్వహణ, వ్యవసాయ పరిశోధన, మరియు రెండు దేశాల మధ్య కనెక్టివిటీ మరియు లాజిస్టిక్స్‌ను మెరుగుపరచడంలో ఈ చర్చలు జరిగాయి. ఐటీ, బ్లూ ఎకానమీ, ఇంధనం, అంతరిక్షం, రక్షణ, విద్య, జీవవైవిధ్య పరిరక్షణ మరియు వాతావరణ చర్యలో సంభావ్య భాగస్వామ్యాలను కూడా నాయకులు అన్వేషించారు.

గయానా ప్రతినిధి బృందం భారతదేశం యొక్క ఇ-మైగ్రేట్ ప్లాట్‌ఫామ్ మరియు ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఎఇఅ) కార్యక్రమంలో సామర్థ్య నిర్మాణం మరియు నైపుణ్య అభివృద్ధికి మార్గాలుగా ఆసక్తిని వ్యక్తం చేసింది.

ఇరువురు నాయకులు క్రికెట్ పట్ల తమ పరస్పర అభిరుచిని పంచుకున్నారు మరియు క్రీడకు గయానా సహకారాన్ని గుర్తించారు.

గ్లోబల్ సౌత్ పట్ల తమ ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, అభివృద్ధి చెందుతున్న దేశాల స్వరం మరియు ప్రయోజనాలను బలోపేతం చేయడానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (జఔాఅ) మరియు అంతర్జాతీయ సముద్ర న్యాయ ట్రిబ్యునల్ వంటి అంతర్జాతీయ వేదికలలో సమన్వయంతో కూడిన ప్రయత్నాల ప్రాముఖ్యతను ఉపాధ్యక్షులు నొక్కి చెప్పారు.

# మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

చౌటుప్పల్, ఫిబ్రవరి 23: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీలోని లింగోజిగూడెం గ్రామ మహిళలకు స్థానిక దివిస్ పరిశ్రమ యాజమాన్యం రూ. 1.18 లక్షల ఆర్థిక సహకారంతో కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివిస్ పరిశ్రమ సీనియర్ అధికారి కే శివప్రసాద్ చేతుల మీదుగా మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం దివిస్ పరిశ్రమ యాజమాన్యం తమ వంతు సహకారం అందిస్తుందని, ఈ కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ లైజన్ ఆఫీసర్ బి కిషోర్ కుమార్, గ్రామ కాంగ్రెస్ నాయకులు పల్లె సురేందర్ రెడ్డి, దివిస్ ప్రతినిధులు బి గోపి, వి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కర్ల రాజేశ్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందజేత



కోదాడ, ఫిబ్రవరి 23 : కర్ల రాజేశ్ కుటుంబానికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో చేయూత అందిస్తామని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ హామీ ఇచ్చారు. రాజేష్ తల్లి లలితమ్మను కలెక్టర్ కోదాడలోని ఆమె నివాసంలో సోమవారం కలిసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన నియామక పత్రం కూడా సిద్ధమైందని, మరో రెండు మూడు రోజుల్లోనే లలితమ్మకు నియామక పత్రాన్ని కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల బెనిఫిట్స్ ను ఆ కుటుంబానికి వర్తింపజేసి, అన్ని విధాలా అండగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డిఓ సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, తాసీల్దార్ వాజీద్ అలీ, యాతాకుల రాజన్న మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్, ఎంఎస్పి రాష్ట్ర నాయకుడు కొండపల్లి ఆంజనేయులు, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు యలమర్తి రాము మాదిగ, ములకలపల్లి రవి మాదిగ, పిడమర్తి చిన్న వెంకట్రావు, లంజపల్లి శ్రీను, ఆకారపు కొండలు, కొండపల్లి సూర్యప్రకాష్, బొడ్డు కుటుంబరావు, సిరిపంగి లింగస్వామి, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు కర్ల శివ, కర్ల కమల్ పాల్గొన్నారు.

# అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకే తనను టార్గెట్ చేశారు

## – టీవీకే చీఫ్ విజయ్



చెన్నయ్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); );ప్రభుత్వాల అవినీతిని, అక్రమాలను ప్రశ్నిస్తూ.. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకే అందరూ తనను టార్గెట్ చేశారని టీవీకే చీఫ్ విజయ్ ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించే బహిరంగసభలకు కూడా డీఎంకే అనుమతి ఇవ్వట్లేదన్నారు. అందువల్లే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలను కలవలేకపోతున్నానని అన్నారు.ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని విజయ్ హామీ ఇచ్చారు. ప్రత్యర్థి పార్టీలు ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గనని, అవినీతిని ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. వేలూరులో నిర్వహించిన బహిరంగసభలో విజయ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో అవినీతిని, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం విఫలమైందని విజయ్ ఆరోపించారు. త్వరలో జరగనున్నవి ఎన్నికలు మాత్రమే కాదని, తమిళనాడు ప్రజలకు, అవినీతి ప్రభుత్వానికి మధ్య యుద్ధమని విజయ్ అన్నారు. ఈ యుద్ధంలో ప్రజలే విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో స్టాలిన్ కుట్ర వన్నుతున్నారని ఆరోపించారు.అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఓటువేస్తే బీజేపీకి వేసినట్లేనని విజయ్ చెప్పారు. ఎన్నికల్లో ఓటమి భయంతో స్టాలిన్ ప్రభుత్వం బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని ఎద్దేవా చేశారు.

# నేను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా: వెంకటరమణారెడ్డి



హైదరాబాద్ ఫిబ్రువరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కామారెడ్డి లో కాంగ్రెస్– బిజెపి నేతల మధ్య వివాదం ముదిరింది. కాంగ్రెస్ నేతలు, బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి కామారెడ్డిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల విషయంలో వివాదం చోటు చేసుకుంది. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ కు వెంకటరమణారెడ్డి బయలు దేరారు. డిగ్రీ కళాశాల అంశంపై కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వనున్నారు. తాము కూడా కలెక్టరేట్ కు వస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిముందు పోలీసులు బందోబస్తు ఉంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు కబ్జాకు గురవుతున్నాయని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి సవాల్ విసిరారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని, డిగ్రీ కాలేజీ భూముల్లో ఒక్క గజం ఆక్రమించినా రాజీనామా చేస్తానని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ఎవరు రెచ్చగొడుతున్నారో పోలీసులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఆర్ టిఐ కింద కాలేజీ భూముల వివరాలు అడిగానని, పూర్తి వివరాలు వచ్చాక.. అందరి సంగతి చూస్తానని కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు

# తక్షణ శక్తికి ఖర్జూరాలు శ్రేష్టం...

హైదరాబాద్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);వ్యాయామం చేయడానికి ముందు, చేసిన తరువాత అలాగే కొన్ని సందర్భాల్లో శరీరానికి తక్షణ శక్తి అవసరమవుతుంది. తక్షణ శక్తి అవసరమైన సందర్భాల్లో చాలా మందికి వెంటనే గుర్తుకు వచ్చేవి అరటిపండ్లు, ఖర్జూరాలు. ఇవి సరసమైన ధరల్లో లభించడంతో పాటు తీసుకువెళ్లడం కూడా చాలా సులభం. ఇవి కార్బోహైడ్రేట్లతో నిండి ఉంటాయి. శరీరం శక్తి కోసం వీటిని గ్లూకోజ్ గా మారుస్తాయి. దీంతో మనకు తక్షణ శక్తి లభిస్తుంది. అయితే ఖర్జూరం, అరటిపండ్లల్లో తక్షణ శక్తి ఇవ్వడంలో ఏవి బాగా పని చేస్తాయి. శక్తి వేటిలో ఎంత త్వరగా విడుదల అవుతుంది, శక్తి ఎంతకాలం ఉంటుంది.. వంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



## ఖర్జూరాల్లో శక్తి అధికం..

ఖర్జూరాలు చిన్నవిగా ఉంటాయి. కానీ చాలా శక్తి వంతంగా పనిచేస్తాయి. గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు వీటిలో అధికంగా ఉంటాయి. ఇవి నీటి శాతాన్ని తక్కువగా కలిగి ఉంటాయి. కనుక పోషకాలు కేంద్రీకృతమై ఉంటాయి. ఇవి సులభంగా జీర్ణమవుతాయి. కనుక శరీరం వీటిని త్వరగా గ్రహిస్తుంది. ఇక వీటిని వ్యాయామాలకు ముందు, దీర్ఘ వ్యాయామాలలు లేదా క్రీడల సమయంలో, శరీరానికి త్వరగా శక్తి అవసరమైనప్పుడు తీసుకోవచ్చు. ఇవి శరీర బరువును అంతగా పెంచవు కానీ శక్తిని అందిస్తాయి కనుక అథ్లెట్లు వీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు.

## సమతుల్య శక్తికి అరటి పండ్లు..

అలాగే అరటిపండ్ల విషయానికి వస్తే ఇవి సమతుల్య శక్తిని అందిస్తాయి. ఇవి అందించే శక్తి ఎక్కువ కాలం పాటు ఉంటుంది. అరటిపండ్లు సాధారణ, సంక్లిష్ట కార్బొహైడ్రేట్ల మిశ్రమం. వీటిలో నీటి శాతం, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. వ్యాయామానికి 30 నుండి 60 నిమిషాల ముందు వీటిని తీసుకోవడం మంచిది. అరటిపండ్లు శక్తి స్థాయిలను త్వరగా గరిష్ట స్థాయికి చేరుకోకుండా స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. ఖర్జూరాలు తక్షణ శక్తిని అందిస్తాయి. అరటిపండ్లు మితమైన, స్థిరమైన శక్తిని అందిస్తాయి.

## వేటిని తినాలి..?

సహజ చక్కెరలు ఖర్జూరాల్లో అధికంగా , అరటిపండ్లల్లో మధ్య స్థంగా ఉంటాయి. ఫైబర్ కంటెంట్ ఖర్జూరాల్లో తక్కువగా, అరటి పండ్లల్లో ఎక్కువగా ఉంటుంది. ఖర్జూరాలు చాలా త్వరగా జీర్ణమవుతాయి. అరటిపండ్లు నెమ్మదిగా జీర్ణమవుతాయి. వ్యాయామం చేసే ముందు, వ్యాయామం చేసే సమయంలో తీసుకోవడానికి ఖర్జూరాలు అనువుగా ఉంటాయి. వ్యాయామానికి గంట ముందు తీసుకోవడానికి అరటిపండ్లు అనువుగా ఉంటాయి. తక్షణ శక్తి కోసం ఖర్జూరాలను తీసుకోవడం మంచిది. స్థిరమైన, సంపూర్ణ శక్తి కోసం అరటిపండ్లను తీసుకోవడం మంచిది. ఖర్జూరాలు, అరటిపండ్లు శక్తిని అందించడంలో రెండూ ఎంతో సహాయపడతాయి. అయితే వీటిని శరీర శక్తి అవసరాలను బట్టి దేనిని తీసుకోవాలో ఎవరికి వారు నిర్ణయించుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

# పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : ఈఈ సుమంత్



నల్గొండ, ఫిబ్రవరి 23: పారిశుధ్య పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కొత్తగూడెం ఏరియా సివిల్ ఈఈ సుమంత్ స్పష్టం చేశారు. సోమవారం ఏరియా పరిధిలోని ధన్బాద్ ప్రాంతంలో జరుగుతున్న సివిక్ పనులను సూపర్‌వైజర్ నిఖిల్ ఆధ్వర్యంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల తీరు, నిర్వహణ విధానం గురించి సంబంధిత సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా రోడ్లపై చెత్త పేరుకు పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్త కుండీలను నిర్ణీత వ్యవధిలో ఖాళీ చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రతను కాపాడాలని సూచించారు. పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఈఈ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సూపర్‌వైజర్ షకీల్ పాల్గొన్నారు.

# విజయ వినాయక దేవాలయంలో సామూహిక ఉచిత బ్రాహ్మణ ఉపనయనాలు



బాసర ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బాసర క్షేత్ర స్థిత శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము మరియు శైవ మహాపీఠం జంట నగర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ దీనదయాళ్ నగర్ లోని విజయ వినాయక దేవాలయంలో సామూహిక ఉచిత బ్రాహ్మణ ఉపనయన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగినవి. శ్రీ శారదాంబ వేద విద్యాలయం మరియు శ్రీ వేంకటేశ్వర విద్యారణ్య వేద విద్యాలయం ఘన పాటులు వచ్చి ఉపనయనము చేసుకున్న బ్రాహ్మణ వటువులను వేద స్వస్తి తో ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో జాతీయ అంతర్జాతీయ వాస్తు శాస్త్రజ్ఞులు మరియు శైవ మహాపీఠం అధ్యక్షులు ఎం. ఎం. వి .రావు కి ఉత్తమ ఆధ్యాత్మిక సామాజిక సేవా పురస్కారాన్ని శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు నిర్మల సంధ్యా అంబికానాధ శర్మ లు అందజేసినారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కోటేశ్వర ప్రసాద్,ములుగు మల్లికార్జున ,తాటికొండ నాగ మల్లికార్జున వీర భద్ర ప్రసాద్, యువటూరి అభిషేక్, మంచళ్ళ శ్రీనివాస్ రావు, బాలసుబ్రమణ్యం గణేష్,జగర్లపూడిశ్రీనివాసరావు, అన సింగరాజు అరగోపాలరావు ,కుందర్తి సత్య ప్రభు, ,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రజకులపై దాడి చేసిన నిందితులని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి

## –14.బిసి సంఘాల డిమాండ్

హైద్రాబాద్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్) నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో గత బుధవారం మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రజక దంపతులు స్వామివారి దర్శనం కోసం గుడిలోకి ప్రవేశించగా రజక కులస్తులు టికెట్టు లేకుండా గుడిలోపడికి రావద్దు అని రజకులపై దాడి చేయడం దుర్మార్గమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ,రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.సోమవారం బిసి భవన్ లో నగర్ కాకర్నూల్ సంఘటనపై 14 కుల సంఘాలు సమావేశమైనాయి.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశమ్ లో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూకుటుంబ సభ్యులు దాడి జరపొద్దని, బాధితులు పెత్తందారుల కాళ్ళపై పడి దండం పెట్టిన శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి, సతీష్ రెడ్డి కాళ్లపై మొక్కిన కొట్టొద్దని ప్రాధేయపడ్డ కనికరించకుండా ఆవేశంతో ఊగిపోయిన పెత్తందారులు, బిడ్డను కాళ్లతో తన్ని విసిరేశారు. పసి పాప కొన ఊపిరితో అపస్మారస్థితిలోకి వెళ్లిపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆ పసిపాప మృత్యువుతో పోరాడి శనివారం రోజు మరణించిందని అన్నారు. ఇంత జరుగుతున్న పోలీసు యంత్రాంగం బాధితుల పక్షాన కేసు నమోదు చేయకుండా బాధితులపైనే తిరిగి కేసు నమోదు చేశారని అగ్రకులాల పెత్తందారులకు పోలీసులు వత్తాసు పలకడం సరైనది కాదన్నారు.



పసిపాప హత్యకు కారణమైన దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించే వరకు పోరాటంకొనసాగుతుందనిరాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ అవమానకర దౌర్జన్య కొండపై బి.సి సంఘాలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నెలలు నిండిన పసిబిడ్డని నిర్దక్యంగా దురఅహంకారంతో హత్య చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. నిందితులని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి నష్టపరి హహరమ్ చెల్లించాలని డిమాండ్ చేశారు.నిఖిల్.పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో ర్యాగ అరుణ్ కుమార్,నీలం వెంకటెష్,జిల్లపల్లి అంజి,ఉ.అనంతయ్య,అ.రాజేందర్‌పర్లగోర్ల మోడీ రాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

# మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ ఎల్ మెంచో హతం



మెక్సికో ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మెక్సికో లో మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ నెమెసియో రూబెన్ ఒసెగుయెరా అలియాస్ 'ఎల్ మెంచో హతమయ్యాడు. ఆదివారం జరిగిన ఆపరేషన్‌లో మెంచోను మట్టుబెట్టినట్లు మెక్సికో ఆర్మీ వెల్లడించింది. అయితే ఈ ఘటన మెక్సికో వ్యాప్తంగా హింసాత్మక ఘటనలకు తెరలేపింది. ఎల్ మెంచో అనుచరులు దేశంలోని పలు రాష్ట్రాల్లో హింసకు పాల్పడ్డారు. వాహనాలను, దుకాణ సముదాయాలను తగులబెట్టారు.కాగా, 59 ఏళ్ల ఎల్ మెంచోను పట్టుకోవడం కోసం మెక్సికో సైన్యం ఆదివారం స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. అమెరికా నిఘావర్గాల సమాచారం మేరకు జాలిస్కో రాష్ట్రంలోని తపాల్ప పట్టణంలో అతడు దాగి ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టింది. ఈ క్రమంలో మెంచో అనుచరులు సైనికులపై కాల్పులకు పాల్పడ్డారు. దాంతో సైన్యం ఎదురుదాడి చేసింది. ఈ భీకర ఆపరేషన్‌లో మెంచో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని సైనికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ విషయాన్ని మెక్సికో సైన్యం వెల్లడించింది.మెక్సికో సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో ఎల్ మెంచోతోపాటు అతడి ముఠాకు చెందిన మరో ఆరుగురు కూడా మరణించినట్లు అధికారులు తెలిపారు. అయితే మెంచోను అంతం చేయడానికి ప్రతీకారంగా అతడి అనుచరులు మెక్సికోలోని పలు రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. పలు ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టారు. రహదారులను దిగ్బంధించారు. సూపర్ మార్కెట్లు, బ్యాంకులకు నిప్పంటించారు. ఆందోళనలను అణిచివేసేందుకు సైన్యం బలగాలను భారీగా మోహరించింది. దాంతో మెక్సికోలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.కాగా, ఎల్ మెంచో 2009లో జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ (అఏఔఉ) అనే మాదకద్రవ్యాల ముఠాను స్థాపించాడు. దానిద్వారా దశాబ్ద కాలంలో మెక్సికోలోనే అత్యంత శక్తిమంతమైన నేర సిండికేట్‌గా మారాడు. అమెరికాకు ప్రధాన డ్రగ్స్ అక్రమ రవాణాదారుగా ఎదిగాడు. జాలిస్కో కార్టెల్‌ను అగ్రరాజ్యం ఉగ్ర సంస్థగా పరిగణించింది. మెంచో తలపై 15 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.136 కోట్లు) రివార్డు ప్రకటించింది. ఇదిలావుంటే ఎల్ మెంచోను అంతమొందించడంపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ స్పందించారు.ఎల్ మెంచోను పట్టుకోవడం కోసం మెక్సికో ప్రభుత్వానికి అమెరికా ఇంటెలిజెన్స్ సహకారం అందించిందని తెలిపారు. మెంచో తమ దేశానికి ఫెంటనిల్‌ను అక్రమంగా తరలిస్తున్నాడని, అలాంటి నార్కో టెర్రరిస్ట్‌లను అగ్రరాజ్యం ఎన్నటికీ సహించబోదని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా మెక్సికోలో అల్లర్ల నేపథ్యంలో అక్కడి భారత పౌరులకు మన ప్రభుత్వం అడ్వైజరీ జారీచేసింది. ప్రస్తుత హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా మెక్సికోలోని భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, సాయం కోసం ఎంబసీని సంప్రదించాలని సూచించింది.

# నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు.. అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించం : కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 23: తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడుతున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు.

'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి (ఃఖీూ) పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

# పసి కందును కొట్టి చంపిన పెత్తం దారులను ఖఠినంగా శిక్షించాలి


## –పిఓడబ్లు జాతీయ అధ్యక్షురాలుసంపంగి పద్మక్క,ప్రధాన కార్యదర్శి వెలుగు వనిత డిమాండ్



హైదరాబాద్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్):నగర కర్నూలు జిల్లా కుమ్మర మల్లన్న జాతరలో దైవదర్శనానికి వెళ్లిన రజక కుటుంబం పై దాడి చేసి, రెండేళ్ల పసికందును కళ్ళతో తన్ని నేలకేసి కొట్టి హత్య చేసిన అగ్రకుల పెంతందరాలను కటినంగా శిక్షించాలని జూనీలి విముక్తి జాతీయ కార్యదర్శి వెలుగు వనిత ప్రసిడెంట్ సంపంగి పద్మక్క ఒక ప్రకటనలో తెలంగాణ ప్రభుత్వ న్నీ డిమాండ్ చేశారు,బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు,జాతరలో దైవ దర్శనం కోసం వెళ్తున్న కారణంతో బాలికతో పాటు వేళ కూనీడా చేసిన అగ్రకుల పెంతందరాలు,కులం పేరుతో దూషిస్తూ రజక కుటుంబం దైవ దర్శనం జీర్ణించుకోలేని అగ్రవర్ణాల కుల దురహంకారంతో రెండేళ్ల పాపా అని చూడ కుండా కళ్ళతో తన్ని,బండకేసి కొట్టి చంపడం సభ్య సమాజం తలా దించుకునేలా ఉందన్నారు ,బాధిత కుటుంబానీ పైనే పోలీస్ కేసు పెట్టడం దారుణం ,వేలాది మంది ప్రజల ముందే గణేష్ అనే వ్యక్తిని గదిలో బంధించి చిత్ర హింసలకు గురి చెయ్యడం పోలీసులు నిర్లక్ష్యం రాష్ట్ర నీ లో కింది కులాల పై హత్యలు,దాడులు,హత్యాచారాలు పెరిగి పోయాయని పేర్కొన్నారు ,వీటిని రాష్ట్ర ప్రభుత్వం అదుపు చేయక పోతే ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు

# కవితాలోకాన కల్పవల్లి.. దేవులపల్లి

## ఫిబ్రవరి 24... కృష్ణశాస్త్రి వర్ధంతి




తెలుగు భావ కవితా రంగంలో ఆయన ఒక ముఖ్య అధ్యాయం.

ఆయన కవిత్వంలో భావుకత్వం వెల్లివిరుస్తుంది.. ఆయన రాసే గీతాల్లో లాలిత్యం పాఠకులను తన్మయత్వంలో మునిగితేలేలా చేస్తుంది. తెలుగు సినిమా రంగాన ఆయన పాటలు జగద్విఖ్యాతం. ఆంధ్రా షెల్లీగా ప్రఖ్యాతి గాంచి **"కృష్ణపక్షం"** వంటి గొప్ప రచనను తెలుగు పాఠకులకు అందించిన ఆ మేటి సాహితీ దురంధరుడే "దేవులపల్లి కృష్ణశాస్త్రి". రేడియాలో లలిత గీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు రాయడం ద్వారా ప్రఖ్యాతి పొందారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని రామచంద్రపాలెం గ్రామంలో తమ్మన్నశాస్త్రి, సీతమ్మ దంపతులకు నవంబరు 1, 1897 తేదీన జన్మించారు. అతని విద్యాభ్యాసమంతా పిఠాపురం పాఠశాలలో సాగింది. పాఠశాల రోజుల్లోనే కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం వంటి రచయితల వద్ద ఆంగ్ల సాహిత్యాన్ని ఔపోసన పట్టాడు కృష్ణశాస్త్రి. 1918లో విజయ నగరం వెళ్లి డిగ్రీ చేస్తున్న రోజుల్లోనే ఆయనకు కవిత్వం రాయడం పట్ల మమకారం ఏర్పడింది. డిగ్రీ పూర్తి చేసి పెద్దాపురంలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాక ఆయన పూర్తిస్థాయిలో రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టారు. బ్రహ్మసమాజం లోను, నవ్య సాహితీసమితి లోను సభ్యునిగా, భావ కవితోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. 1922లో కృష్ణశాస్త్రి సతీమణి అర్థాంతరంగా మరణించడంతో కొన్నాళ్లు అదే బాధలో గడిపారు ఆయన. అదే బాధలో అనేక విషాద కవితలు రాశారు. ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయత్వం, ప్రవాసము, ఊర్వశి వంటి ఖండకావ్యాలు అలా పుట్టినవే. 1929లో రవీంద్ర నాథ్ టాగుర్‌తో ఏర్పడిన పరిచయం కృష్ణశాస్త్రి జీవితాన్ని మరో మలుపు తిప్పింది. మరిన్ని కవితా రచనలను చేసేలా ప్రేరేపించింది.

లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం – కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. చందమామ లోని చల్లదనాన్ని, మందార పువ్వులోని మకరందాన్ని, గుండెలోని ఆర్ద్రతని రంగరించి రాస్తే అది కృష్ణశాస్త్రి పాటవుతుంది. పట్టు పరికిణిలో ఒదిగిన సింగారం కృష్ణశాస్త్రి పాట. ఆయన తెలుగు పదం అమ్మమ్మ చేతిలో నేతి నైవేద్యం. వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర తనువును తాకితే ఎంత పులకరిస్తామో, కృష్ణశాస్త్రి కవిత వింటుంటే అదే పులకరింత వీనుల విందుగా వస్తుంది. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసిన అతి కొద్ది మంది కవులలో కృష్ణశాస్త్రి ముందుంటారు. తెలుగు సినిమాల్లో జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని భరతమాతను కీర్తించినా, జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి.. అంటూ దేశభక్తిని చాటినా.. ఆకులో ఆకునై , పువ్వులో పువ్వునై , నను లేత రెమ్మనై, సెలయేటిలో పాటనై, తెరచాటు తేటినై , నీలంపు నిగ్గునై... అని మగువ ఆర్ద్రతకు పెద్దపీట వేసినా అది కృష్ణశాస్త్రికే చెల్లింది. భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ 'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టి, సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించి, మల్లీశ్వరితో ప్రారంభించి కృష్ణశాస్త్రి ఎన్నో చక్కని సినిమా పాటలు అందించారు. అవి సామాన్యులనూ, పండితులనూ కూడా మెప్పించే సాహితీ పుష్పాలు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించాడు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు. పిలచిన బిగువటరా, -- మనసున మల్లెల మాలలు, ఆకాశ వీధిలో హాయిగా , ఔనా.. నిజమేనా? సడి సేయకో గాలి

ప్రతి రాత్రి వసంత రాత్రి,
రానిక నీకోసం, ఆకులో ఆకునై,
ఆరనీకుమా ఈ దీపం, గోరింట పూచింది, పగలైతే దొరవేరా,
గట్టుకాడ ఎవరో, కుశలమా.. నీకు కుశలమేనా, చుక్కలతో చెప్పాలని, అడుగడుగున గుడి ఉంది, రావమ్మా మహాలక్ష్మి, ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, ఈనాటి బంధం ఏనాటిదో, వేళ చూస్తే.. సందె వేళ, చీకటి వెలుగుల కౌగిటిలో, పాడనా తెనుగు పాట,

ఇది మల్లెల వేళయనీ, మావి చిగురు తినగానే, లాంటి పాటలు సినీ సాహిత్యంలో అజరామరాలు. 1975లో-ఆంధ్ర విశ్వవిద్యాలయం - కళాప్రపూర్ణ, 1978లో సాహిత్య అకాడమీ అవార్డు, 1976లో పద్మ భూషణ్ దేవులపల్లి ని వరించాయి. 1964 లో తిరుపతిలో అన్నమయ్య జయంతి ఉత్సవంలో కృష్ణశాస్త్రి పాల్గొన్నారు. ఆయన వెంట బాలాంత్రపు రజనీ కాంతరావు కూడా వెళ్ళారు. ఉపన్యాసం చదివేందుకు ఉద్యుక్తుడైన కృష్ణశాస్త్రి గొంతు బొంగురు పోయింది. దాంతో తన ఉపన్యాసాన్ని రజనీకాంతరావు చేత చదివించారు. వైద్య పరీక్షల్లో అది గొంతు క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. మద్రాసులో కృష్ణశాస్త్రి స్వరపేటికను తొలగించారు. స్వరపేటిక తొలగించిన తరువాత కృష్ణశాస్త్రి దాదాపు పదహారేళ్లు బ్రతికినా, మూగవోయిన కంఠంతోనే అనేక సినిమాలకు పాటలు, ఆకాశవాణికి లలిత గీతాలు రాశారు. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించారు. తెలుగు దేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్లీ మరణించాడు' అంటూ కృష్ణశాస్త్రి చనిపోయిన రోజున శ్రీశ్రీ రోదించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ 'ఒక్క షెల్లీ యే కాదు, కీట్స్, వర్డ్స్‌వర్త్ వంటి మహాశయుల సంయుక్త స్వరూపం కృష్ణశాస్త్రి' అన్నారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494




అర్హులైన డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలనే డిమాండుతో, ఇవ్వాళ రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద డెస్క్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ధర్నా చేపట్టింది. ఇందుకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం పక్షానా సంఘీభావం తెలుపింది. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ పలువురు జర్నస్టులు పాల్గొన్నారు.

# తురకకాశ ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించాలి

**పాలకులు మారిన తురకకాశ ముస్లింల బ్రతుకు మారడం లేదు**
**-సుత్తే, శానంతో వాళ్లు ఇంకెన్నాళ్లు జీవనం గడపాలి**
**-ప్రభుత్వం అందించే టూల్ కిట్స్ వాళ్ల బ్రతుకులు మార్చలేవు**
**-కంప్రెషర్లు, ట్రాక్టర్లు, గూడ్స్ వాహనాలు సబ్సిడీపై అందించి వారిని ఆదుకోవాలి**
**-జమియతుల్ ఉలేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ డిమాండ్**

కరీంనగర్, ఫిబ్రవరి 23: (నేటినిజం ప్రతినిధి) దశాబ్దాలు గడుస్తున్నా, తెలంగాణ రాష్ట్రంలో పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా.. సంచార జీవులుగా పరిగణించబడే తురక కాశ ముస్లింల జీవన ప్రమాణాలు మాత్రం మారడం లేదని, ప్రభుత్వం అందించే వెయ్యి రూపాయల టూల్ కిట్, వారి జీవితాలను ఏమాత్రం మార్చబోదని జమియతుల్ ఉల్లేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలలోని చేతివృత్తులకు అందిస్తున్న పథకాలను సంచార జీవులుగా ఉన్న ఈ తురక కాశ ముస్లింలకు వర్తింపజేయాలని కంప్రెషర్లు ట్రాక్టర్లు సబ్సిడీపై మినీ గూడ్స్ వాహనాలను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. సుత్తి శానం వంటి టూల్ కిట్స్ ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటూందని ఆరోపించారు. సబ్సిడీపై ఇచ్చే స్కూటీలతో వారికి ఏమాత్రం లాభం జరగదని చెప్పారు. గడచిన 25 సంవత్సరాలుగా తమ సంస్థ తరపున తాను, ముస్లిం జేఏసీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబూబకర్ ఖాలీద్ కలిసి తురక కాశ ముస్లింల జీవన ప్రమాణాలను మార్చేందుకు అలుపెరగకుండా కృషి చేస్తున్నామన్నారు. తురక కాశ ముస్లిం యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఉన్నత విద్య చదువులను ప్రోత్సహించి, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా డ్రైవింగ్, హోటల్ మేనేజ్మెంట్ వంటి కోర్సులను చదివే విధంగా ప్రోత్సహించామన్నారు. వృత్తివిద్య కోర్సులతోపాటు ఇస్లామిక్ విద్యను సైతం అందించడంలో గత 25



సంవత్సరాలుగా తాము విశేషంగా కృషి చేసినట్లు చెప్పారు. విద్యకు దూరమై, బండ కొడుతూ, రెక్కల కష్టాన్ని నమ్ముకొని జీవిస్తున్న తురక ముస్లింలను సంచార జీవులుగా రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని, దళిత, గిరిజనుల మాదిరిగా వీరికి కాంప్రెషర్లు ట్రాక్టర్లు మినీ గూడ్స్ వాహనాలు సబ్సిడీపై అందించాలని కోరారు. అప్పుడే వీరి జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయన్నారు. ప్రభుత్వాలు మారుతున్న తురకకాశ ముస్లింలను పాలకులు పట్టించుకోవడంలో, వీరి కాలనీలను మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడంలో వీరికి పూర్తిస్థాయిలో విద్యను అందించడంలో, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టూల్ కిట్స్ వంటి పథకాలను మార్చి, సబ్సిడీపై గూడ్స్ వాహనాలు అందించే పథకాలను ప్రవేశ పెట్టే విధంగా ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

### సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట క్రీడా పోటీలు మార్చి 1 నుండి 7 వరకు ...

# జరగబోయే క్రీడా పోటీలు యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతో దోహదం...

**-బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి.....**

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 23 నేటినిజం (ప్రతినిధి): సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట క్రీడా పోటీలు మార్చి 1 నుండి 7 వరకు జరుగుతాయని, ప్రధానంగా పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మార్చి ఒకటి నుండి 3 వరకు , గెలుపొందిన జట్లకు 5,6,7 తేదీల్లో కరీంనగర్ హెడ్ క్వార్టర్ లో ఈ క్రీడా పోటీలు కొనసాగుతాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలోసంసద్ ఖేల్ మహోత్సవ్ నిర్వహణ ఏర్పాట్ల కోసం బీజేపీ ముఖ్య నేతలు, ఇన్చార్జిలతో సన్నాక సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్ గా మార్చాలని విజన్ పెట్టుకున్నారని, ఆ దిశలోనే ప్రతి ఏటా ఖేల్ మహోత్సవ పేరిట క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల నిర్వహణ వల్ల ముఖ్యంగా ఎంతోమంది క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసే అవకాశం ఉంటుందన్నారు. జరగబోయే క్రీడా పోటీలను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహి ంచడం జరుగుతుందని తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, హాకీ, అట్లాటిక్స్ 100, 400 మీటర్ల పరుగు పందెం, హై, లాంగ్ జంప్, షాట్ పుట్, జావలన్, డిస్క్ త్రో లాంటి ముఖ్యమైన క్రీడా పోటీలను నిర్వహి స్తున్నందున , ఆయా క్రీడా పోటీల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులందరూ పాల్గొని ఖేల్ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఆయా క్రీడా పోటీల్లో పాల్గొనడానికి ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఈనెల 25 నుండి 27 వరకు అసెంబ్లీ వారిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి , కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ , కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్ , మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీలతో పాటు అసెంబ్లీ నియో జకవర్గ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, నాయకులు, ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# పేద వధువు వివాహానికి వెస్సో సాయం

హైదరాబాద్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నల్గొండ జిల్లా, మిర్యాలగూడ నివాసి, చి.ల.సౌ. పాలకి నవ్య (24) ఒక పేద కుటుంబానికి చెందిన యువతి. ఆమె తండ్రి లక్ష్మీ నారాయణ చారి వృత్తి రీత్యా రోజువారీ కూలీ పొందే కార్పెంటర్. తల్లి గృహిణి. నవ్య అన్న ఐటీఐ పూర్తి చేసినప్పటికీ, స్థిరమైన ఉద్యోగం లేక రోజువారీ కార్పెంటర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ కుటుంబం ప్రస్తుతం నెలకు -2,000 అద్దెతో అస్బెస్టాస్ షెడ్ ఇంటిలో నివసిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అద్దె కూడా సకాలంలో చెల్లించలేక, తరచూ ఇల్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటు న్నారు.అదృష్టవశాత్తు, చి. నవ్య వివాహం అదే జిల్లాకు చెందిన వరుడితో, ఎటువంటి కట్నం లేకుండా నిశ్చయ మయింది. వివాహానికి కావలసిన ప్రాథమిక ఖర్చులు కూడా భరించే స్థోమత ఈ కుటుంబానికి లేదు. స్థానిక నాయకుల ద్వారా వెస్సో ట్రస్ట్ గురించి తెలుసుకున్న వధువు తండ్రి వివాహ ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించమని కోరగా, స్పందించిన వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల మద్దతుతో వధువు సోదరుడు సాయికిరణ్ కు 44,700 రూపాయలు అందజేశారు.

# తమిళనాడులో 5.67 కోట్ల మంది ఓటర్లు




చెన్నై, ఫిబ్రవరి 23: తమిళనాడు రాష్ట్రంలో 5.67 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆ రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ ఈ విషయాన్ని తెలిపారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 97.37 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు ఆమె వెల్లడించారు. సర్ ప్రక్రియ చేపట్టడానికి ముందు తమిళనాడులో సుమారు 6.41 కోట్ల మంది ఓటర్లు ఉండేవార్నారు. ఈసారి కొత్తగా 18 నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న సుమారు 7.40 లక్షల మంది కొత్త ఓటర్లు చేరినట్లు సీఈవో తెలిపారు. ఈ రోజు నుంచి ఓటర్ల జాబితా అప్‌డేట్ ప్రక్రియ ప్రతి రోజు జరుగుతుందని ఆమె వెల్లడించారు. తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఓటర్లలో 2,77, 38,925 కోట్ల మంది పురుషులు, 2,89,60,838 కోట్ల మంది మహిళలు, 7,617 వేల మంది థార్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

# గడ్డిన్నారంపండ్ల మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం..రైతుల కంఠ ఘోష..

**సామాజిక విశ్లేషకులు సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ గౌడ్.**

హైద్రాబాద్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్): దక్షణ భారత దేశం లో అతి పెద్ద దైనా గడ్డి అన్నారం పండ్ల మార్కెట్,, సుమారుగా 199 ఎకరాల విస్తీరణంలో దీని గత ప్రభుత్వం నిర్మించింది. ఇదే మార్కెట్ ను కోహెడ రెవెన్యూ పరిధిలో దాదాపుగా 200కోట్ల రూపాయల వ్యయం తో తాత్కాలిక షెడ్లు వేసి నిర్మించారు. వేసిన మూడు నెలలకే గాలి దూ మరం తో లేచి పోయింది. అదే మార్కెట్ ఇప్పుడు బాటసింగారం లో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వంలో ప్రముఖ పాత్ర పోషించిన మాజీ మంత్రి కే టి అర్ కన్ను సైగలో నడిచింది. దాదాపు గా 60 ఎకరాల ప్రభుత్వ భూమి నీ హెచ్ ఎండి స్వాధీనం చేసుకొని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. ఇప్పుడు పండ్ల మార్కెట్ నెలకు 66లక్షలు రూపాయలు సదరు ప్రైవేట్ సంస్థకు అద్దె కింద చెల్లిస్తుంది.లిజు దక్కించుకున్న సంస్థ మాజీ మంత్రి, ప్రస్తుత సిరిసిల శాసన సభ్యులు కే టీ అర్ కు బింగాలా మహేష్ కోమటి అత్యంత సన్నిహితులు కావడం విశేషం. సదరు సంస్థ హైద్రాబాద్, మెట్రో డెవలప్మెంట్ సంస్థ ఒప్పందం ప్రకారం మార్కెట్ లో సుపర్ స్పెషా లిటీ ఆసుపత్రి, సబ్సిడీ మీద భోజన లు, ఇతర రాష్ట్రాల రైతుల నుండీ వచ్చిన రైతులకు రెస్ట్ రూంలు, మరుగు దొడ్లు, స్నానపు గదులు, మోడరన్ టైపు లో నిర్మించాలనే నిబంధన లో ఉంది. కానీ అక్కడ ఇవేమి కానిపించావు. అంత మైదానం ప్రాంతం, చెత్త చెదారం, సూదురా ప్రాంతాల నుండీ వచ్చే రైతులు, ఎక్కడ నీడ కానిపిస్తే అక్కడే సేద తీర్చుకుంటున్నారు. కానీసం ఈ ప్రభుత్వమైనా ఈ మార్కెట్ మీద దృష్టి పెట్టి రైతులకు మెరుగైనా వసతులు కాల్పించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# కుమ్మెర గ్రామంలో ఘోరానికి నైతిక బాధ్యత వహించి సీఎం రాజీనామా చేయాలి!

హైద్రాబాద్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్):నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో బీసీలకు చెందిన రజక (చాకలి) కుటుంబాన్ని వేధించి అభం శుభం తెలియని శిశువును చంపివేసి, అత్యంత నీచానికి పాల్పడ్డ దురంహంకార 'రెడ్లను' వెంటనే ఎన్ కౌంటర్ చేయాలని 'తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక' కన్వీనర్ భారత్ సుదర్శన్ డిమాండ్ చేసారు. ఈ భూమ్మీద బతకడానికి వాళ్లకి ఎలాంటి అర్హత లేదని,ముఖ్యమంత్రి జిల్లాలోనే ఈ ఘటన జరగడం ఘోరమని, నైతిక బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేసి,దోషులకు కఠిన శిక్ష పడేలా చేయాలని 'తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక' కోరింది. దురంహంకార 'రెడ్ల' ఇండ్లల్లో గానీ, వారి దగ్గర గానీ.. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు పనిచేయవద్దని 'తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక' సూచించింది.

# ఎస్ కె ఎఫ్ నకిలీ బేరింగ్స్ స్వాధీనం

**-ఎస్ కె ఎఫ్ బీరింగ్స్ సంస్థ మరియు హైదరాబాదు పోలీస్ వారి సంయుక్త దాడి**




హైద్రాబాద్ ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్,) వినియోగదారులను తప్పుదారి పట్టిస్తూ, భారతదేశంలో SKF బేరింగ్స్ ప్రతిష్టను దెబ్బతీస్తున్న నకిలీ ఉత్పత్తుల పెరుగుతున్న ముప్పును అరికట్టేందుకు, హైదరాబాద్ పోలీసులు సికింద్రాబాద్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. SKF బేరింగ్స్ సంస్థ ఫిర్యాదు మేరకు, నగరంలో నకిలీ సరుకుల చలామణిని నియంత్రించడం మరియు బ్రాండ్ విశ్వసనీయతను కాపాడడం లక్ష్యంగా ఈ ఆపరేషన్ చేపట్టబడింది. ఈ దాడులు రాణిగంజ్ ప్రాంతంలోని S V Tool & Bearing, గంజి కాంప్లెక్స్‌లోని Bearing International, అలాగే సికింద్రాబాద్ ప్రాంతంలోని A 2 Z Machinery Store అనే మూడు దుకాణాలను లక్ష్యంగా చేసుకొని, హైదరాబాద్ పోలీసుల మహంకాళి పోలిసు అధికారుల సహకారంతో నిర్వహించబడ్డాయి. SKF సంస్థకు భారతదేశంలో విశేష స్థానం ఉంది మరియు అధిక నాణ్యత గల బేరింగ్స్ ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఉంది. అయితే, హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాల్లో కొందరు నకిలీ వ్యాపారులు వినియో గదారులకు నకిలీ బేరింగ్స్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించబడింది. ఈ దాడుల సందర్భంగా సుమారు 1987 నకిలీ బేరింగ్స్ ముక్కలు మరియు దాదాపు 2780 అవుటర్ బాక్స్ షీట్లు స్వాధీనం చేసుకున్నారు. చట్ట అమలు సంస్థల అధికారులు మరియు SKF బేరింగ్స్ ప్రతినిధులు పాల్గొన్న ఈ దాడి బృందం నకిలీ సరుకులను విజయవంతంగా గుర్తించింది. అరెస్టు చేయబడిన వ్యక్తులపై ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈఎఫ్ఐ) నమోదు చేయబడింది. ఈ కీలక సమస్యను పరిష్కరించేందుకు, హైదరాబాద్ పోలీసుల మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ చర్యలు చేపట్టబడ్డాయి. ఈ ప్రాంతంలో నాణ్యతపై అనుమానాలు మరియు నకిలీ ఉత్పత్తుల ఉనికి గురించి వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, వినియోగదారుల రక్షణ మరియు SKF బ్రాండ్ ప్రతిష్టను కాపాడేందుకు సంస్థ దర్యాప్తులు ప్రారంభించి, హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ దాడి వంటి చర్యలను చేపట్టింది.

# సీఎం కప్ హాకీ రాష్ట్ర స్థాయి విజేత నల్లగొండ జట్టు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 23 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో నల్లగొండ బాలుర హాకీ జట్టు ఫైనల్స్ లో 2-0 తేడాతో నిజామాబాద్ జట్టును మట్టికరిపించి సీఎం కప్ విజేతగా నిలిచింది.

నల్లగొండ జిల్లా జట్టు విజయం పట్ల జిల్లా క్రీడల అధికారి అక్బర్ అలీ, హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఇమామ్ కరీం హర్షం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com